# లోక్‌సత్తా టైమ్స్

₹ 10/-

సంపుటి 2 సంచిక - 14 | పక్షపత్రిక | జులై 16-31, 2011

## బలమైన లోక్‌పాల్ కోసం ప్రజాఉద్యమం





చిత్తూరు జిల్లాలో పర్యావరణ పరిరక్షణపై లోక్‌సత్తా పార్టీ ర్యాలీ




నర్సరావుపేట పాతూరులో మహిళాసత్తా సర్వసభ్య సమావేశం



నర్సరావుపేట, వరవకట్టలో మహిళాసత్తా సమావేశం



తూ.గో జిల్లా కాకినాడలో సభ్యత్వ నమోదు & ఓటరు సహాయకేంద్రం



గుంటూరు 46 వార్డులో వార్డుస్థాయి శిక్షణ




చిలకలూరిపేటలో కార్యకర్తల సమావేశం




ప్రత్యక్ష పద్ధతిలో మున్సిపల్ చైర్మన్ ఎన్నికలపై
విజయనగరంలో యువసత్తా రౌండ్ టేబుల్ సమావేశం

జన రాజకీయం కోసం...

**లోక్‌సత్తా టైమ్స్**

పక్షపత్రిక జులై 16-31, 2011

సంపుటి - 2 సంచిక - 14

## లోపలి పేజీల్లో...

ఒకే చట్టంలో దేశానికి లోక్‌పాల్.............5
బలమైన లోక్‌పాల్ కోసం ఉద్యమం......... 6
2జీ కుంభకోణంలో మరో కేంద్రమంత్రి..... 7
శాసన సభ్యుల రాజీనామాలు,
రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం................10
తిరోగమన రాజకీయాలకు ప్రతీక........... 12
రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధిరేటు........... 13
కేంద్రం 'నగదు బదిలీ' సంక్షేమం.............14
సంక్షోభంలో పౌర గ్రంథాలయరంగం.......16
చదువులేని వారు 2.11 కోట్లు...............18
బతుకులెట్ల తెల్లారాలె............................ 19
జనాన్ని కదిలించడం ఎలా?................... 21
యూత్‌ఫోరం........................................ 25
జనజీవనం నుండి... శాసన మంతిలికి..... 27
వ్యవసాయోత్పత్తుల స్వేచ్ఛా వాణిజ్యానికి..... 28
స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య........... 29
రైతువేదిక........................................... 30
లోక్‌సత్తా ఉద్యమవార్తలు........................ 32

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **జ్యోతి తాటి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# రాష్ట్రంలో జనాకర్షణ పథకాల పోటీ ప్రభుత్వ "గ్రీన్ ఛానల్" విన్యాసం

## సంపాదకీయం

రాష్ట్రం సమస్యల వలయంలో వుంది. ఆర్థిక సంక్షోభంలో వుంది. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల గడువు వుంది. అయినా మన రాజకీయ పార్టీలకు ఎన్నికలు తప్ప మరో ధ్యాస లేదు. అధికార కాంక్ష తప్ప మరో యావ లేదు. ఎన్నికలు దూరంగా వున్నప్పుడైనా ఈ పార్టీలు కీలకసమస్యల పరిష్కారాలనూ, అభివృద్ధి వ్యూహాలను చర్చిస్తాయన్న ఆశ కనిపించడం లేదు.

ముందుగా మహానాడు జరిగింది. చంద్రబాబు ఈ సభల్ని రాజకీయ ఎదురుదాడికి, ప్రజలకు వరాల జల్లు కురిపించడానికి వినియోగించుకున్నారు. తర్వాత జగన్ నిర్వహించిన ప్రజాప్రస్థానం. ఇది ఆ పార్టీ ప్రారంభ రాజకీయ సభ. ఈ పార్టీ పుట్టుకముందు నుంచీ కుర్చీమీదే ధ్యాస. అది పుట్టిననాడు అదే ధ్యాస. జనాకర్షణ పథకాలు ప్రకటించడంలో మాత్రం జగన్ తండ్రిని మించిన తనయుడయ్యాడు.

ఈ నేపధ్యంలో రాష్ట్రప్రభుత్వం కూడా జనాకర్షణ పథకాల అమలులో తమకు ఎవరూ సరిరారు అంటూ గ్రీన్‌ఛానల్ పథకాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో 28 పథకాలకు 9 నెలలు ముందుగానే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో ఫీజుల రీయింబర్స్‌మెంటును మినహాయించింది. దానికి కిస్తీలు కూడా సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా 17 వేల కోట్లు ఇతర పథకాలకు సిద్ధం అంటూ ప్రకటించింది. రాష్ట్ర బడ్జెట్ ఘనంగా వుంది. ఒక లక్షా28వేల కోట్లు. అందులో 16 వేలు కోట్లు లోటుతో వుంది. నెలనెలా జీతాలు, పెన్షన్లు తప్ప ఇతర ఖర్చుల మీద నిన్నటివరకూ ఆంక్షలూ కోతలు పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు నిధుల మూటలు విప్పడం నీటిమూటలుగా కనిపిస్తున్నది.

ఈ మూడు పార్టీల వరస చూస్తుంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని కుక్కలు చింపిన విస్తరి చేసేలా కనిపిస్తున్నాయి. ఎందుకంటే రాజకీయాలకు సిద్ధాంతాలు వుండాలని అభివృద్ధి వ్యూహాలు వుండాలని, సాధించే విధానాలు వుండాలన్న చింతనకు ప్రధాన పార్టీలు, కొత్తగా పుట్టుకొచ్చిన పార్టీలు చితిపెడుతున్నాయి. జనాకర్షణ పథకాలకీ, సంక్షేమ పథకాలకీ తేడా కూడా ఈ పార్టీలకు తెలియకపోవడం కంటే విషాదం మరొకటి వుండదు.

వికలాంగులనీ, వృద్ధులనీ, అనాధలనీ ఆదుకోవాలి. తిండికి గతిలేని వారికి భరోసా ఇవ్వాలి. ఈ సంక్షేమ పథకాలని ఎవరూ కాదనరు. ఓట్లకోసం కులాలని ఆకర్షించే పథకాలు, కుటుంబాలకు నేరుగా లబ్ధిచేకూర్చే పథకాలు, కలర్ టీవీలు మనీ ట్రాన్స్‌ఫర్లు ప్రభుత్వ ఖజానాతో ఓట్లు కొనుగోలు చేసే పద్ధతులు జనాకర్షణ పథకాలు ఇవి ప్రజల్ని అస్వతంత్రుల్ని చేస్తాయి. ఆర్థిక వ్యవస్థల్ని దివాళా తీయిస్తాయి. అభివృద్ధికి అడ్డుగోడలవుతాయి. రాజకీయ పార్టీలకి ఈ విచక్షణ వుండాలి. ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చేదానికి ఎంతైనా ఖర్చు పెట్టాలి. వారిని యాచకులుగా మార్చే రాజకీయానికి స్వస్తి పలకాలి. – అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథం పడుతుంది. అదే రాజకీయానికి లక్ష్యం కావాలి. ■




*Indianink* సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
ఇం.నం. 5–10–180/ఎ&ఎ1,
బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,
హైదరాబాద్ – 500 004,
ఫోన్: 040–2323 1818
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-2323 1818.*
*సెల్ : 80085 07934*

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఒకే చట్టంలో దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్త, స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మన్

## ప్రధానమంత్రికి డా॥ జేపీ లేఖ

ప్రతిపాదిత లోక్‌పాల్ బిల్లులో ప్రతి రాష్ట్రంలో లోకాయుక్త, దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక అంబుడ్స్‌మన్‌ను నియమించే ఏర్పాటు ఉండాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు.

"అవినీతి సమస్య కేవలం కేంద్రప్రభుత్వానికే పరిమితం కాదు. మన రాష్ట్రాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో అవినీతి విస్తృతంగా ఉంది. అన్ని రాష్ట్రాలకు స్థానిక ప్రభుత్వాలకు వర్తించేలా 2005లో సమాచార హక్కు బిల్లుని పార్లమెంటు ఆమోదించిందని అదే తరహాలో లోక్‌పాల్ బిల్లు కూడా తీసుకురావాలని ప్రధానమంత్రికి, అన్ని పార్టీల నేతలకు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖలో తెలియజేశారు.

లోక్‌పాల్ చట్టం రాష్ట్రాలకు వర్తింపచేయకపోవటం ప్రజల విశ్వాసాన్ని కాలరాయటమేనని, కేంద్రప్రభుత్వం తన బాధ్యతల నిర్వహణలో విఫలమవటమేనని జేపీ స్పష్టంచేశారు. ఇది ఎంతమాత్రం సహించరానిదన్నారు. "లోక్‌పాల్‌పై మొత్తం చర్చలో మనం చిన్నచిన్న అంశాలపై రాద్ధాంతం చేస్తూ మౌలికమైన లక్ష్యాల్ని వదిలేస్తున్నాం" అన్నారు.

ఆ బిల్లును పరిపుష్టం చేసేందుకు ఏప్రిల్ 24, 2011న న్యూఢిల్లీలో జాతీయస్థాయి పౌర ప్రముఖులతో తాము నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం చేసిన కీలక సిఫార్సుల్ని ప్రధానమంత్రి దృష్టికి తెచ్చేందుకు ఈ లేఖ రాసారు. ఆచరణాత్మకమైన రీతిలో పటిష్టమైన, స్వతంత్రప్రతిపత్తిగల లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటుకు ఈ సూచనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు.

కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్త, స్థానిక ప్రభుత్వాల్లో స్థానిక అంబుడ్స్‌మన్ ఉండేలా పార్లమెంటు ప్రభావవంతమైన ఒకే చట్టాన్ని చేయాలని రౌండ్‌టేబుల్ ఏకగ్రీవంగా సిఫార్సు చేసిందన్నారు. తమతమ పరిధిలో ఆ సంస్థలన్నిటికీ ఒకే తరహా విధులు, అధికారాలు ఉంటాయన్నారు.

అదేతీరుగా రాష్ట్రాల స్థాయిలో ముఖ్యమంత్రుల స్థాయిని కాపాడి, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిరహితంగా, జవాబుదారీతనంతో పనిచేసేందుకు వీలుగా ముఖ్యమంత్రుల్ని లోకాయుక్త పరిధిలో కాకుండా, జాతీయస్థాయిలోని లోక్‌పాల్ పరిధిలోకి తీసుకెళ్లాలని రౌండ్‌టేబుల్ సూచించిందన్నారు. సీబీఐ, ఏసీబీల అవినీతి నిరోధక విభాగాల్ని కూడా లోక్‌పాల్ పరిధిలోకి తెచ్చి నేర పరిశోధన స్వతంత్ర ప్రతిపత్తితో, నిష్పాక్షికంగా జరిగే ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ జోక్యం వల్ల సీబీఐ, ఏసీబీ నేరపరిశోధనలు నీరుగారిపోతున్నాయని బలమైన ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయన్నారు. సీబీఐ అవినీతి నిరోధక విభాగాన్ని వేరుచేసి లోక్‌పాల్, ఏసీబీ పరిధిలోకి తేవాలన్నారు. అదేరీతిన రాష్ట్రాల్లో లోకాయుక్త పరిధిలోకి తేవాలన్నారు.

లోక్‌పాల్ అధికారిక ముసాయిదా బిల్లులో ఉన్న ఈ కింది అంశాలను జేపీ స్వాగతించారు...

- లోక్‌పాల్ నియామకానికి సభ్యుల వ్యవస్థ ఏర్పాటు. అవసరమైతే సెర్చ్ కమిటీకి అవకాశం.
- సుప్రీంకోర్టు సిఫార్సుతో మాత్రమే లోక్‌పాల్ తొలగింపు
- ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ నియామకానికి, ప్రాసిక్యూషన్ ప్రక్రియను నిర్దేశించేందుకు లోక్‌పాల్‌కు అధికారం
- లోక్‌పాల్ వ్యయానికి భారత కన్సాలిడేటెడ్ నిధి నుంచి కేటాయింపు
- ఏ కోర్టు లేదా కమిటీ ముందున్న ఆరోపణలపై కూడా విచారించే అధికారాన్ని లోక్‌పాల్‌కు కల్పించటం
- బెంచ్‌ల ఏర్పాటుకు లోక్‌పాల్‌కు అధికారమివ్వటం
- విచారణకు ఏ విధమైన అనుమతి లేక ఆమోదం లోక్‌పాల్‌కు అవసరం లేకుండా ఏర్పాటు చేయటం
- ప్రత్యేక కోర్టులో కేసును ఫైల్ చేసే అధికారాలు లోక్‌పాల్‌కివ్వటం
- లోక్‌పాల్ సిఫార్సు మేరకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు
- ఆస్తుల స్వాధీనానికి, అవినీతి రుజువైతే ఆస్తులు జప్తు చేసేందుకు ఏర్పాట్లు

... రౌండ్‌టేబుల్ సూచనలతో బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు రాజకీయాలకతీతంగా కృషి చేస్తారన్న విశ్వాసాన్ని జయప్రకాష్ నారాయణ్ వ్యక్తం చేశారు. ■

**జులై 25 నుండి 31 వరకు అవినీతి వ్యతిరేక వారం**

# బలమైన లోక్‌పాల్ కోసం ఉద్యమం

## సంతకాల సేకరణ, సభలు - సమావేశాలకు లోక్‌సత్తా పిలుపు

మన పాలనా వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోతున్నాయి. దేశ ప్రగతికి, ఆర్థికాభివృద్ధికీ అవినీతి అడ్డంకిగా మారింది. లోక్‌పాల్ బిల్లు రూపకల్పన కోసం అన్నాహజారే బృందానికి, ప్రభుత్వానికి మధ్య చర్చలు సఫలం కాలేదు. తర్వాత జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో కూడా ఏకాభిప్రాయం రాలేదు.

లోక్‌పాల్ చట్టం పరిధిలో ఎవరెవరిని చేర్చాలి అన్న అంశంపై ఏకాభిప్రాయ సాధనకు ప్రభుత్వం అందరితో సంప్రదింపులు జరపాలి. అంతకుమించి అవినీతిపరుల భరతంపట్టేదిగా బలమైన లోక్‌పాల్ చట్టాన్ని రూపొందించాలి. దీనికోసం ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచాలి.

1. ఒకే చట్టంలో దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్తలు, స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మన్ వ్యవస్థలను (సమాచార హక్కు చట్టం తరహాలో) ఏర్పాటు చెయ్యాలి.
2. ముఖ్యమంత్రులని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలి.
3. విజిలెన్స్ కమిషన్లని లోక్‌పాల్, లోకాయుక్తలలో ఎక్స్-అఫిషియో సభ్యులుగా చేసి, వారిని లోక్‌పాల్, లోకాయుక్తల రీతిన నిష్పాక్షికంగా నియమించాలి.
4. సి.బి.ఐ.లో అవినీతి నిరోధక విభాగాన్ని, రాష్ట్రాలలో ఎ.సి.బి.లని లోక్‌పాల్, లోకాయుక్తల పర్యవేక్షణలో ఉంచాలి. అవినీతి పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా చెయ్యాలి.

అవినీతి నిరోధక చట్టం (ఆంధ్రప్రదేశ్) 2009 పేరుతో డా॥ జయప్రకాష్‌నారాయణ్ ప్రతిపాదించిన బిల్లు ఇలాంటి చట్టాలకు మార్గదర్శకంగా వుంటుంది. అవినీతిపరులకు శిక్షలు పడేలా ప్రభుత్వజోక్యం లేని ప్రాసిక్యూషన్ వ్యవస్థ, అవినీతి పరుల ఆస్తుల జప్తుకు నిర్దిష్టమైన ఏర్పాట్లు వుండాలి. అలాంటి బలమైన లోక్‌పాల్ చట్టం కోసం అందరూ ఉద్యమించాలి.

**జులై 25 నుండి 31 వరకు అవినీతి వ్యతిరేక వారాన్ని పాటించండి** – వేలాదిగా సంతకాలు సేకరించండి. సభలు సమావేశాలు నిర్వహించండి. బలమైన లోక్‌పాల్ కోసం అందరూ గళంవిప్పండి. ■



# 2జీ కుంభకోణంలో మరో కేంద్రమంత్రి... మారన్

**తీగలాగితే డొంక కదిలినట్టు కేంద్రటెలీమ్యూనికేషన్ల శాఖలో ఒక్కొక్క కుంభకోణం వెలుగు చూస్తున్నది. భారతదేశం లోనే అతి పెద్ద కుంభకోణంలో యు.పి.ఎ భాగస్వామ్య పక్షం డి.యం.కె, దాని అధినేత కరుణానిధి కుటుంబం చుట్టూ ప్రస్తుతానికి ఇది అల్లుకుని వుంది. డి.యం.కె. మంత్రి ఎ.రాజా రాజీనామా నుండి ఇటీవల కళానిధి మారన్ రాజకీనామా వరకు సాగిన ఈ కుంభకోణంలో కరుణానిధి కుమార్తె కనిమొళితోసహా పలు సంస్థలు భాగస్వాములుగా ఉన్నారు.**

### ఏమిటి ఈ 2 జీ?

2జీ తరంగాల కేటాయింపులో భారీ గోల్‌మాల్ జరిగింది. 2008లో 122 లైసెన్సులను 85 కంపెనీలకు కేటాయించారు. అత్యంత పరిమితమైన, విలువైన ఈ సాంకేతిక వనరును కారుచౌకగా కట్టబెట్టారు. టెలికం రంగం ఇబ్బడిముబ్బడిగా విస్తరించి స్పెక్ట్రమ్ కోసం విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ... దీనికి 2001 నాటి ధరలనే వర్తింపజేశారు. బహిరంగ వేలంలో కేటాయించాలన్న సూచనలు, సిఫారసులను పక్కనపెట్టి... 'ముందు వచ్చిన వారికి ముందు' ప్రతిపదికన లైసెన్సులు ఇచ్చారు. అనేక అక్రమాలకు పాల్పడ్డారు. అస్మదీయులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు.







దీంతో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ॥ 1.76 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అంచనా వేసింది.

### ఇది తొలి వికెట్

2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో పడ్డ మొదటి వికెట్ ఎ.రాజాదే. భారీ స్థాయిలో విమర్శలు వెలవడినా పదవి పట్టుకు వేలాడిన టెలికం మంత్రి రాజా... ఎట్టకేలకు గత ఏడాది నవంబర్‌లో తన పదవి వదులుకున్నారు. చివరకు జైలుకు వెళ్లక తప్పలేదు. ఆ తర్వాత... కరుణా నిధి ముద్దుల కూతురు, రాజ్యసభ సభ్యురాలు కనిమొళిని కూడా సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసులో రాజా కుట్రదారైతే... కనిమొళి 'సహ కుట్రదారు'. ఈమెతో పాటు కలైజ్ఞర్ టీవీ సీఎండీ శరత్ కుమార్‌ను కూడా సీబీఐ జైలుకు పంపింది.

### కార్పొరేట్ కుట్ర

2జీ కేసులో చాలామంది కార్పొరేట్ పెద్దల పేర్లు బయటికి వచ్చాయి. వారిలో... షాహిద్ ఉస్మాన్ బల్వా, స్వాన్ టెలికం మాజీ డైరెక్టర్ సంజయ్ చంద్ర, యూనిటెక్ లిమిటెడ్ ఎండీ గౌతమ్ దోషి, అడాగ్ గ్రూప్ ఎండీ హరినాయర్, అడాగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సురేంద్ర పిపారా తదితరులపై ఆరోపణలున్నాయి.

### మారన్ చేసిన మాయ

- **మ్యాక్సిస్‌కు 'ఎయిర్‌సెల్' వరం**
- **తన కంపెనీలోకి పెట్టుబడుల ప్రవాహం**

చేతిలో అధికారం ఉంది. నచ్చిన వారైతే నెత్తికెక్కించు కుంటారు. లేదంటే.. కాలికింద వేసి తొక్కిపడేస్తారు. టెలికం మంత్రిగా ఉన్న సమయంలో దయానిధి మారన్ ఇదే చేశారు. తమిళనాడుకే చెందిన ఎయిర్‌సెల్ కంపెనీకి లైసెన్సులు ఇవ్వకుండా ముప్పుతిప్పులు పెట్టారు. వెర్రిమొర్రి ప్రశ్నలు, సంబంధంలేని అభ్యంతరాలు, రకరకాల కొర్రీలు లేవనెత్తి ఎయిర్ సెల్‌కు చుక్కలు చూపించారు. ఎయిర్ సెల్ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారు. 'ఏమిటి సంగతి' అని ఆరా తీస్తే... 'మీకు లైసెన్సులు ఇచ్చేది లేదు. కంపెనీని మలేషియాకు చెందిన

మాక్సిస్ గ్రూప్‌కు అమ్మేయండి. అనే సంకేతాలు వెలువడ్డాయి. ఈ దిశగా శివశంకరన్‌పై మారన్ తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. చివరికి... శివ శంకరన్ తలొగ్గక తప్పలేదు. 2006 మార్చిలో ఎయిర్‌సెల్‌లో 74 శాతం వాటాను మాక్సిస్ గ్రూప్‌కు రూ.3390 కోట్లకు విక్రయించారు. దీంతో కంపెనీ మ్యాక్సిస్ గ్రూప్ సొంతమైంది. అంతే... అంతకుముందు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు చకచకా కదిలాయి. అభ్యంతరాలన్నీ అదృశ్యమయ్యాయి. కొన్ని రోజుల్లోనే మాక్సిస్ గ్రూప్ అధ్వర్యంలోని ఎయిర్‌సెల్‌కు అన్ని రకాల అనుమతులు లభించాయి. ఆ తర్వాతే... అసలు కథ మొదలైంది. ఎయిర్ సెల్‌కు సకల అనుమతులు లభించిన తర్వాత మాక్సిస్ గ్రూప్ అనుబంధ సంస్థ సౌత్ ఏషియా ఎంటర్‌టైన్‌మెంట్ హోల్డింగ్ లిమిటెడ్ దయానిధి మారన్ కుటుంబానికి చెందిన సన్‌టీవీ నెట్‌వర్క్‌లో దశలవారీగా రూ. 600 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అదే సమయంలో సన్ నెట్‌వర్క్‌లో మారన్ కుటుంబసభ్యులకు 12.6 కోట్ల ఈక్విటీ షేర్లు దక్కాయి. వీరి మొత్తం వాటా 80 శాతానికి చేరుకుంది.

ఇది ఇంతటితో ఆగలేదు. మాక్సిస్ గ్రూప్ 2008 ఫిబ్రవరి-09 జూలై మధ్యలో మారన్‌లకే చెందిన సన్‌ఎఫ్ఎం రేడియో నెట్‌వర్క్‌లో మరో రూ.100 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. శివశంకరన్ చేత ఎయిర్‌సెల్‌ను బలవంతంగా విక్రయించేలా చేసి, కంపెనీని తన పరం చేయించి, అన్ని రకాల లైసెన్సులను జారీ చేసినందుకు.. మాక్సిస్ గ్రూప్ దయానిధి మారన్‌కు 'పెట్టుబడుల' రూపంలో ప్రతిఫలం చెల్లించుకుంది. డీబీ రియాలిటీ కూడా ఇదే తరహాలో కరుణానిధి కుటుంబానికి చెందిన కలైజ్ఞర్ టీవీలో రూ.2.00 కోట్లు 'పెట్టుబడి'గా పెట్టి.. లైసెన్సులు జారీ చేసిన రుణం తీర్చుకుంది. మారన్ మాయలు రిటైర్డ్ జడ్జీ జస్టిస్ శివరాజ్ పాటిల్ కమిటీ విచారణలో స్పష్టమయ్యాయి. సీబీఐ దర్యాప్తులోనూ ఇదే తేలింది. బుధవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన స్థాయీ నివేదికలో సీబీఐ ఈ వివరాలన్నీ బయటపెట్టింది. మారన్ ఒత్తిడి వల్లేతాను ఎయిర్‌సెల్‌ను విక్రయించాల్సి వచ్చిందని శివ శంకరన్ తన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. దీంతో దయానిధి మారన్ తన పదవికి రాజీనామా చేయకతప్పలేదు. ■

## 629 కోట్ల కుంభకోణం స్వంత ఇంట్లో 323 టెలిఫోన్ కనెక్షన్లు

ఇది వార్త కాదు వాస్తవం. విన్నవాళ్లు విస్తుపోతారు. ఇది బహిరంగ దోపిడీ. ప్రభుత్వ ఖజానాను స్వంతానికి యధేచ్ఛగా వాడుకోవడం. ఇది హద్దుమీరిన అధికార దుర్వినియోగం, అవధులు దాటిన అవినీతి. కాని గుట్టు చప్పుడు కాకుండా సాగిపోయిందని. ఇంతటి నిర్వాకం సాగించింది. ఒక కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి, ఆయనే దయానిధి మారన్. ఆయన ఇంటికి 323 టెలిఫోన్ కనెక్షన్లు ఇచ్చుకున్నాడు. ఇది కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న ఢిల్లీలో కాదు ఆయనకు చెన్నైలో వున్న స్వంత ఇంటికి. తన పేరు మీద కూడా కాదు. ఏకంగా బి.యస్.యల్.యన్ జనరల్ మేనేజరు (చెన్నై) పేరుతో. చెన్నైలో ఆయన బోట్‌క్లబ్ నివాసంలో ఒక స్వంత టెలిఫోన్ ఎక్సేంజ్ పెట్టించుకున్నాడు.

ఇంతకీ అది ఇంట్లో వాడకానికి కాదు. ఎక్సేంజ్‌కి మాత్రమే ఇల్లు. అక్కడి నుండి 3.5 కిలోమీటర్ల దూరం తమ వ్యాపార సంస్థ సన్ టి.వి. వ్యాపార సముదాయం బిల్డింగ్ వరకు రహస్య కేబుల్‌లోని ఏర్పాటు చేశారు. కేబుల్ రహస్యం కాని దానిని బహిరంగంగా రోడ్ల గుండానే వేయించారు.

2004 మే 26న దయానిధిమారన్ కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. 2007 మే 15 వరకు కేంద్ర మంత్రిగా వున్నారు. కరుణానిధితో కుటుంబ తగాదా వల్ల రాజీనామా చేశారు.

ఈ పదవీ కాలంలో ఆయన చేసిన ఘనకార్యం ఇది ఇవి సాధారణ టెలిఫోన్ కనెక్షన్లు కావు. తన సోదరుడు కళానిధి మారన్ పేరుతో వున్న అన్నా సలైలో వున్నా సన్ టీవీ ప్రసారం కోసం డిజిటల్ సమాచారాన్ని చేరవేయడానికి వినియోగించే శక్తివంతమైనవి. ఇవి టన్నుల కొద్దీ డిజిటల్ సమాచారాన్ని శాటిలైట్లకంటే త్వరితంగా చేరవేసే సామర్థ్యం కలవి. కొన్ని నెలల పాటు కోట్ల రూపాయలు సన్ టి.వి కోసం వీటిని దుర్వినియోగం చేశారు. సి.బి.ఐ దానిపై దర్యాప్తు చేసింది. 10-09-2007లో దయానిధి మారన్ అక్రమంపై చర్య తీసుకోవాలని టెలికాం సెక్రటరీకి ఉత్తరం రాసింది. 2011కి గాని ఈ కుంభకోణం వెలుగులోకి రాలేదు. ఇన్నేళ్లు దీనిని ఆ మంత్రిత్వశాఖలు తొక్కిపెట్టి వుంచాయి. ■

# 2జి స్పెక్ట్రం కుంభకోణం ... కాలనాళిక

దేశ చరిత్రలోనే అతి పెద్దదైన 2జీ స్పెక్ట్రం కుంభకోణం వెలుగుచూసిన క్రమాన్ని తేదీల వారీగా ఇస్తున్నాం....

**2009, అక్టోబరు 22 :** కేంద్ర విజిలెన్స్ కమీషన్ సూచన మేరకు టెలికాం అధికారులపై సి.బి.ఐ ఒక ఎఫ్.ఐ.ఆర్‌ను నమోదు చేసింది.

**2010 నవంబరు మొదటి వారం :** 2జి స్పెక్ట్రమ్ (వాయు తరంగాలు) వేలం ప్రక్రియలోని అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు 1 లక్షా 76 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేసిన 'కాగ్' నివేదికలోని అంశాలను పత్రికలు బైటపెట్టాయి.

**2010, నవంబరు 9 :** ఈ కుంభకోణం పై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వెయ్యాలని ప్రతి పక్షాలు ఉభయ సభల్ని స్తంభింపజేశాయి. 5 వారాల పాటు, పార్లమెంటు శీతాకాల సమావేశాలు స్తంభించాయి.

**నవంబరు 14, 2010 :** కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఎ.రాజాతో రాజీనామా చేయించారు.

**నవంబరు 16, 2010 :** కాగ్ నివేదికను ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు.

**డిసెంబరు 8 :** సి.బి.ఐ దాడులు ప్రారంభం. రాజా ఇంటిపైనా ఆయన సహాయకుల ఇళ్లమీద, రాజా బంధువులు, సంబంధాలున్న వారి ఇళ్లపైనా సి.బి.ఐ దాడులు చేసింది. కీలక పత్రాలు దొరికినట్టు ప్రకటించింది.

**డిసెంబరు 15 :** కార్పొరేట్ సంస్థలకు లాబీలు చేసే నీరా రాడియా ఇంటిని సి.బి.ఐ సోదా చేసింది. ఆమెను పలుమార్లు ప్రశ్నించింది.

**డిసెంబరు 24, 25 :** ఢిల్లీలో రాజాను సి.బి.ఐ. ప్రశ్నించింది.

**2011, జనవరి 31 :** తిరిగి ప్రశ్నించింది.

**ఫిబ్రవరి 2 :** రాజాను సి.బి.ఐ అరెస్టు చేసింది.

**ఏప్రిల్ 20 :** స్పె..... సిటి కోర్టు వీరికి బెయిల్ నిరాకరించింది.

**ఏప్రిల్ 25 :** కరుణానిధి కుమార్తె కనిమొళిని, ఆమెతో పాటు కళైంగార్ టీ.వికి చెందిన శరద్‌కుమార్‌ను, సినీయుగ్ ఫిలింమ్స్‌కు చెందిన కరీంమొరాని, అసిఫ్ బల్వా, కుసేగాం రియాల్టీకి చెందిన రాజీవ్ అగర్వాల్‌లను 2జి. కుంభకోణంతో సహా కుట్రదారులుగా సి.బి.ఐ పేర్కొంది.

**మే 20 :** కనిముళి బృందానికి బెయిల్ నిరాకరించడంతో తీహార్ జైలుకు తరలించారు.

**జూన్ 20 :** కనిముళికి సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది.

**జులై 6 :** కేంద్ర జౌళిశాఖా మంత్రి గతంలో కమ్యూనికేషన్స్ మంత్రిగా వున్నప్పుడు ఎయిర్‌సెల్ షేర్లను బలవంతంగా తన కుటుంబంతో సన్నిహితంగా వున్నా మాక్సిస్ గ్రూపుకు అమ్మించారని సి.బి.ఐ ఆరోపించింది.

**జులై 7 :** కళానిధి మారన్ తన మంత్రి పదవిని వదులుకోవలసి వచ్చింది. రాజీనామా చేశారు. ■

# నేరగాళ్లపై అనర్హత కొరడా

ప్రజా ప్రాతినిధ్య చట్టంలో కొన్ని సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. వీటికి సంబంధించి న్యాయశాఖ ఇప్పటికే ఒక ముసాయిదా నోట్‌ను సిద్ధం చేసింది.

– కోర్టుల్లో తీవ్రమైన నేరాభియోగ కేసులు ఎదుర్కొంటున్న వారు ఎన్నికల్లో పోటీ చేయటానికి అనర్హులవుతారు. ఐదేళ్ల అంతకన్నా ఎక్కువకాలం జైలు శిక్షపడే నేరాలను అనర్హత కోసం పరిగణిస్తారు. నామినేషన్ దాఖలు చేసే తేదీ నుంచి ఏడాది లోపు అభియోగాలు నమోదైన కేసులకు ఇది వర్తించదు. రాజకీయ ఉద్దేశాలతో కూడిన అభియోగాల విషయంలో తగు 'భద్రత' కల్పితమ అభ్యంతరాలను హైకోర్టు దృష్టికి తేచొచ్చు. హైకోర్టు దీనిని 15 రోజుల్లో పరిష్కరించేలా ప్రత్యేక ట్రైబ్యునల్ లేదా కోర్టుకు సిఫారసు చేస్తుంది. ట్రైబ్యునల్ నిర్దోషిగా గుర్తిస్తే సదరు అభ్యర్థి నిరభ్యంతరంగా పోటీ చేయొచ్చు.

– గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు, మహిళా అభ్యర్థులకు ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తుంది. వార్షికాదాయం రూ॥5 లక్షలు. స్థిర, చరాస్తుల విలువ రూ॥22 లక్షలు మించనివారికి ఈ ప్రయోజనం లభిస్తుంది.

# శాసన సభ్యుల రాజీనామాలు రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం

- డి.వి.వి.యస్. వర్మ

తెలంగాణా సమస్యపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలంటూ తెలంగాణా ప్రాంతానికి చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు జులై 3,4,5 తేదీలలో రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను నేరుగా స్పీకర్లకు అందజేశారు. ఆ తర్వాత తెలంగాణ కాంగ్రెస్‌నేతలు ఢిల్లీలో రెండు రోజులపాటు చర్చలు జరిపారు. కాని ప్రతిష్టంభన తొలగలేదు. రాజీనామాలు స్పీకర్ల దగ్గర వున్నాయి. రాష్ట్రంలో ఇరుప్రాంతాలలో ఉద్యమాల వేడి సాగుతోంది. మొత్తంమీద రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఈ రాజీనామాలతో కొత్త దశకు చేరుకుంది.

రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నిజానికి రెండేళ్లుగా సాగుతున్నది. ముందుగా రాజశేఖర రెడ్డి మరణంతో అధికారంలో వున్న కాంగ్రెస్‌పార్టీలో సంక్షోభం ప్రారంభమైంది. ఇది పార్టీపరంగా తలెత్తిన సంక్షోభం మాత్రమే. కాగా డిసెంబరులో కె.సి.ఆర్. ఆమరణదీక్ష అనంతర పరిస్థితులు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలలో అంతర్గత సంక్షోభం ఆవరించింది. ఉభయప్రాంతాలకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు ఆనాడు రాజీనామాలు చేశారు. త్వరలోనే ఆ రాజీనామాల ఉపసంహరణలతో సంక్షోభం తాత్కాలికంగా సర్దుమణిగింది. కాని అన్ని పార్టీలలో లోపల ఈ సంక్షోభం

## తెలంగాణ పై నాన్చుడు ఆపండి : జేపీ



"సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం ఏర్పాటు ప్రజాస్వామ్య, రాజకీయ ఏర్పాటు మాత్రమే తప్ప జీవన్మరణ సమస్య కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవమూ కాదు, ప్రజల సమస్యలకు సర్వరోగ నివారిణీ కాదు అని లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ స్పష్టంగా చెబుతోంది. కాబట్టి అన్ని ప్రాంతాల ప్రజలూ ప్రశాంతతను పరిరక్షిస్తూ, ఆ అంశాన్ని చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలి.

"రెండు పక్కలా భావోద్వేగాలు చెలరేగినప్పుడు బాధ్యత గల నాయకులు నిగ్రహంతో వ్యవహరించి, చర్చల ద్వారా సంతృప్తికర పరిష్కారానికి సానుకూలతను ప్రదర్శించాలి. సమస్యను పరిష్కరించటంలో జాప్యం వల్ల ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు భారీ మూల్యం చెల్లించారు. కోట్లాది ప్రజల జీవితాల్ని ప్రభావితం చేస్తున్న సున్నితమైన అంశం పట్ల భారత ప్రభుత్వం, అన్ని ప్రధాన పార్టీలు నేరసమాన నిర్లక్ష్యాన్ని, బాధ్యతారహితంగా తప్పించుకునే ధోరణిని ప్రదర్శిస్తూ దోషులుగా నిలబడ్డాయి.

"దేశ ప్రయోజనాలను, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకుని ఈ సంక్షోభాన్ని త్వరితంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించటం భారత ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

రాజుకుంటూనే వుంది. ప్రధాన పార్టీలలో మంత్రిమండలిలో చట్టసభల సభ్యులలో ఒకేపార్టీకి చెందిన వారైనప్పటికీ వారిమధ్య సయోధ్య లేదు. కలిసి పనిచేసే స్థితిలేదు. పైగా ఒకరి మీద మరొకరు ప్రకటనలు చేసుకునే స్థితి వచ్చింది. తమ తమ పార్టీలను ఏకోన్ముఖంగా నడపగల స్థితి ప్రధానపార్టీలకు లేకుండా పోయింది. పార్టీలు తమ నేతలని అదుపుచేసుకోలేని స్థితిలో పడ్డాయి.

మరొకపక్క పార్టీలకు అతీతంగా చట్టసభ సభ్యులు ప్రాంతాలవారీగా వ్యవహరించడం మొదలుపెట్టారు. ఈ రెండేళ్లలో అనేక సందర్భాలలో ఇది ప్రస్ఫుటంగా వెల్లడైంది. ఒకమాటలో చెప్పాలంటే ప్రధాన రాజకీయ పార్టీలు నాయకత్వ సంక్షోభంలో పడ్డాయి. ఇప్పుడు ప్రధానపార్టీల నేతలు, చట్టసభల సభ్యులు పార్టీల ఆదేశానుసారం కాకుండా ప్రాంతాలవారీగా ప్రతిస్పందించే స్థితి వచ్చింది. దీంతో రాష్ట్ర సమైక్యత లేదా విభజనలపై ప్రధాన పార్టీలలో ఏకాభిప్రాయం లేకుండా పోయింది. రాష్ట్రంలో రాజకీయం తెగిన గాలిపటంగా మారింది.

రాష్ట్ర భవిష్యత్తు సమస్య నుండి ఉత్పన్నమైన సంక్షోభం ఇప్పుడు ప్రధానపార్టీలకు ప్రాంతీయ అస్థిత్వ పోరాటంగా మారింది – అధికారంలో వున్న పార్టీ అధిష్టానం మీద భారం పెట్టి అచేతనంగా మారింది. అధిష్టానం తమ పార్టీ స్థితిని చక్కదిద్దడానికి కొత్త ముఖ్యమంత్రిని, కొత్త అధ్యక్షుణ్ణే, కొత్త ఉప ముఖ్యమంత్రినీ తెచ్చింది. అయినప్పటికీ ఆ పార్టీ ఏకముఖంగా వ్యవహరించగల స్థితి లేదు. ఎందుకంటే అసలు సమస్యను నానబెట్టి, ముదరబెట్టి ఇప్పుడు ఇలాంటి నైపుణ్యతలతో పరిష్కరించడం దానికి సాధ్యం కాదు. అలాగే ఈ పార్టీలో జగన్ కుంపటి సంక్షోభాన్ని మరింత పెంచింది.

మరోపక్క ప్రధాన ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం పార్టీలోనూ అదే పరిస్థితి కొనసాగుతున్నది. అది ఒక పార్టీగా కనిపిస్తున్నా రెండు భాగాలుగానే పనిచేస్తున్నది. తెలంగాణా సమస్యకు పరిష్కారం తమ చేతుల్లో లేదని కేంద్రానిదే బాధ్యత అంటూ ఆ పార్టీలో ఏకత్వం కోసం చంద్రబాబు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రోజుకో ఉద్యమం, పూటకో ఆందోళనలతో తన నాయకత్వాన్ని నిలుపుకునే తంటాలు పడుతున్నారు. కాని ఒకచోట కన్నం పడితే దానిని మూసేలోగా మరోచోట గండిపడుతున్న చందంగా ఆ పార్టీ ప్రయాణం సాగిస్తున్నది.

రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికైనా విజ్ఞతతో వ్యవహరించాలి. వివిధ ప్రాంతాలలో స్థానిక ప్రాబల్యం కోసం పోటీపడడానికి స్వస్తిచెప్పాలి. ఇలాంటి ప్రయత్నాల వల్లే ఈ పార్టీలు ముక్కచెక్కలుగా వ్యవహరించడానికి కారణంగా గుర్తించాలి. రాష్ట్రాన్ని రాజకీయం సంక్షోభం నుండి బైటపడేసే మార్గాలను అన్వేషించడం మీద దృష్టి పెట్టాలి. ఈ రాష్ట్రం, దేశం మనందరిదిగా భావించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం మీద దృష్టి సారించాలి. పార్టీ ప్రయోజనాల కోసమే ఆలోచించే రాజకీయ నాయకులలా కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం రాజనీతిజ్ఞుల లాగా వ్యవహరించాలి. సమస్యలో భాగం కాకుండా పరిష్కారంలో భాగం అయ్యే మార్గాలను అనుసరించాలి. ■


## లోక్‌సత్తా టైమ్స్ వైద్యరంగం ప్రత్యేకసంచిక

**ఆగస్టు 1-15**

ఆంధ్రప్రదేశ్‌లో వైద్యరంగంపై ప్రత్యేక సంచికగా 2011 ఆగస్టు 1-15 పత్రికను వెలువరిస్తున్నాం. ఈ ప్రత్యేక సంచికలో 1. ప్రభుత్వ రంగంలో వైద్యసేవలు, 2. ప్రైవేటు రంగంలో విస్తరిస్తున్న వైద్యసేవలు, 3. ఫార్మాసూటికల్ పరిశ్రమలు, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, 4. మెడికల్, డెంటల్, నర్సింగ్, ఫార్మసీ తదితర కళాశాలలపై ప్రత్యేక వ్యాసాలు, విశ్లేషణలతో సమాచారాన్ని అందిస్తున్నాం.

ఈ ప్రత్యేక సంచికకు మీ తోడ్పాటు ఎంతో అవసరం. మీ సంస్థల తరపున ప్రకటనలు ఇచ్చి ఈ ప్రత్యేక సంచికకు మీ సహకారాన్ని అందించవలసిందిగా కోరుతున్నాం. మీ ప్రకటనలు 2011 జూలై 26వ తేదీలోగా అందేలా ఈ కింది చిరునామాకు పంపించవలసిందిగా కోరుతున్నాం.

### లోక్‌సత్తా టైమ్స్
#### ప్రత్యేక సంచిక ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | మల్టీ కలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | 5000 | 10,000 |
| బ్యాక్‌పేజీ | | 20,000 |
| ఇన్‌సైడ్ కవర్స్ | | 15,000 |

పూర్తి పేజీ సైజు 7 × 10 అంగుళాలు
బ్యాక్ పేజీ సైజు 7 × 8 అంగుళాలు

### మీరు పంపించే చెక్కులు, డ్రాఫ్టులు

లోక్‌సత్తా టైమ్స్ హైదరాబాద్, పేరుతో తీసుకోవాలి.
(ఎకౌంట్ నం: 62007167836
ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ )

**ఈ క్రింది చిరునామాకు పంపించాలి**

**లోక్‌సత్తా టైమ్స్**
ఇం.నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,
హైదరాబాద్ – 500 004, ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

# తిరోగమన రాజకీయాలకు ప్రతీక - జగన్ ప్లీనరీ

మన దేశంలో సైన్సు, టెక్నాలజీ పురోగమనంలో ఉంటే రాజకీయాలు మాత్రం పూర్తి తిరోగామిగా తయారయ్యాయి. ఇటీవల జరిగిన జగన్ వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్లినరీ దీనికి ఒక ఉదాహరణ. సంక్షేమ పథకాలకి, జనాకర్షక పథకాలకి దీనితో గీత చెరిగిపోయింది. ఇరవైఏళ్ళ క్రితం సమాచారాన్ని అందించే "పేజర్"లో ఒక సమాచారాన్ని పంపడానికి ఇన్‌కమిగింగ్‌కి 9రూపాయలు, ఔట్‌గోయింగ్‌కి 16 రూపాయలు అయ్యేవి. పేజర్ నుండి సెల్‌ఫోన్ వ్యవస్థ వచ్చిన తొలినాళ్ళలో నిమిషానికి రూపాయలలో చార్జి చేసేవాళ్ళు. కానీ నేడది పైసకి 2నిమిషాలకు పడిపోయింది. నేడు దేశంమంతటా 3జి సేవలు అందుబాలోకి వచ్చాయి. పేజర్‌లు కాలగర్భంలో కలిసిపోయాయి. సమాచార మాధ్యమం అత్యంత వేగంగా తక్కువ ఖర్చుతో అందరికి అందుబాటులోకి వచ్చింది. రాజకీయాలలో మాత్రం ఓట్లు కొనడానికి మద్యం, డబ్బు ఎరగా చూపే రాజకీయాలు సమాచార విప్లవం కంటే వేగంగా పరిగెడుతున్నాయి. ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారి సామాన్యుడు పోటీ చేయని స్థితికి చేరాయి.

స్వతంత్రం వచ్చిన కొత్తలో పారిశ్రామిక విప్లవం, హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ఇలా పరిశ్రమలతో పాటు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ప్రజల ఆకాంక్షలకి పాలకుల స్వార్థానికి మధ్యన రానురాను పెద్ద ఆగాధం చోటు చేసుకుంది. ఆ సంక్షోభం నుండే సంక్షేమ, జనాకర్షక పథకాలు వచ్చాయి. ప్రభుత్వం నుండి పూర్తి ఉచిత విద్య, ఆరోగ్యం, వ్యవసాయ విజ్ఞానం అందిన రోజుల నుండి ఇవన్నీ నేడు వ్యాపారంగా మారిన స్థితిని చూస్తున్నాము. ఎప్పుడో 70వ దశకంలో 'గరీబీ హటావో' నినాదంతో ఇందిరాగాంధీ ప్రారంభించిన సంక్షేమ పథకాలు మెల్లమెల్లగా రూపుమార్చుకుంటూ 2003లో ఎన్.టి.ఆర్. మొదలెట్టిన 2రూ॥లకు కిలోబియ్యం. 2004లో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన జనాకార్షక పథకాల పుణ్యమా అని 2009లో చంద్రబాబునాయుడు నగదు బదిలీ పథకం ప్రకటించే దశకు చేరుకున్నాయి.

2004లో వై.యస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన సంక్షేమ, జనాకర్షక పథకాలు 2009 కల్లా రాష్ట్ర ఖజానాను గుల్లచేసేవిగా తయారయ్యాయి. ఆర్భాటంగా ప్రారంభించిన "జలయజ్ఞం" కాస్త "ధనయజ్ఞం"గా మారి కాలువలు మాత్రమే మిగిలి ప్రాజెక్టులు మొదలెట్టని పరిస్థితికి చేరింది. లక్షా యభైవేల కోట్ల రూపాయల నిధులను గత ఆరేళ్ళుగా జలయజ్ఞం మీద గుమ్మరించినా కూడా కొత్తగా సాగు నీరు అందిన భూమి వేల ఎకరాలు కూడా లేదు.

ఇక జగన్ విషయానికి వస్తే మొన్నటి పార్టీ ప్లీనరీలో ఉపరితల అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యం విద్య, ఆరోగ్యం ఇతర మౌలిక అభివృద్ధి విషయాలలో కనబడలేదు. సంక్షేమ పథకాల పేరున ప్రజలను యాచకులుగా మార్చే జనాకర్షక పథకాలకే పెద్ద పీటవేసింది. తండ్రి బాటలోనే కొడుకుకూడా తన కొత్త పార్టీని నడిపించే ప్రయత్నమే చేశారు. అందరికి విద్య, ఆరోగ్యం అంటే నాణ్యమైన విద్య, ఆరోగ్యంగా ఆలోచించే కొత్త మోడల్ ఆవిష్కరించవలసిన అవసరం ఉంది. కానీ ఈ ప్లీనరీలో దాని సంగతి పట్టినట్లు లేదు. రాజశేఖర్‌రెడ్డి ఆలోచనలకి కొనసాగింపుగానే ఈ ప్లీనరీలోని అంశాలు ఉన్నాయి.

### కొండత రాగం తీసి...

తెలంగాణ విషయంలో అన్ని పార్టీలకంటే స్పష్టంగా తమ పార్టీ విధానం ఉంటుందని జగన్ అనుయాయులు పార్టీ ముఖ్యులు ప్లీనరీ కంటే ముందు వారం రోజులుగా టీవిలలో, పత్రికలలో ఊదరగొట్టారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు తెలంగాణ విషయంలో అవలంభిస్తున్న వైఖరిని ఎండగట్టారు. చివరికి ప్లీనరీ ముగిసే దశలో ఊరించి ఊరించి తెలంగాణ పై రాజకీయ తీర్మానాన్ని జగన్ మాటలలో చెప్పించారు. కొండత రాగం తీసీ........ అన్న చందంగా మిగతా పార్టీలకు భిన్నంగా అనే మాట అటుంచి కాంగ్రెస్, తెలుగు దేశం వైఖరినే కొత్త పార్టీ కూడా వెల్లడించింది. తెలంగాణ విషయంలో ఎటూ తెల్చకుండా "సెంటిమెంట్‌ని గౌరవిస్తున్నామని" అంటూనే ఇది చాలా సున్నిత సమస్య అని 'సన్నాయి నొక్కులు' నొక్కింది. తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండని ఎవరికి తోచిన వ్యాఖ్యానాన్ని వారిని చేసుకోమంది.

కొత్త పార్టీ కొత్త ఆలోచన విధానంతో కొత్త అభివృద్ధి నమూనాతో "థర్డ్‌జనరేషన్" అవసరాలకి తగట్టుగా ఉంటుందని ఎవరు ఊహించకపోయినా, కనీసం నేటి ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ సొంత కాళ్ళపై నిలబడి, స్వతంత్ర జీవితం సాగించడానికి కొత్త ఆర్థిక, రాజకీయ మౌలిక అభివృద్ధి, వసతుల విషయంలో కొత్త నమూనా ప్రవేశపెట్టడానికి, ఈ ప్లీనరీ ఉపయోగపడితే బాగుండేది. ■

**- బండారు రామ్మోహన్ రావు**

# రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధిరేటు తరుగుతున్న జనజీవనం

*వృద్ధిరేటులో రాష్ట్రం ముందున్నది. తలసరి ఆదాయం ఘనంగానే వుంది. ఇది జనజీవనానికి దూరంగా వున్నాయి. రాష్ట్రం అక్షరాస్యతలో వెనకబడింది. వైద్య సేవలు మృగ్యం. వృద్ధిరేటుకి తగ్గట్టు పేదరికం తగ్గిన లెక్కలు లేవు. దారిద్రరేఖకు దిగువన వున్నా వారి సంఖ్య తగ్గడం లేదు. ఇంతటి వృద్ధిరేటులో రైతులకి లాభాలు లేవు. యువతకి ఉపాధిలేదు. గ్రామాలు, పట్టణాలు నివాసయోగ్యంగా లేవు ఆర్థికాభివృద్ధి రేటుని ప్రజల జీవనంలో ప్రతిఫలింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత. వాటి బాధ్యతారాహిత్యమే ఈ అంతరాలకి కారణం. ఈ వృద్ధి రేటు లెక్కల్ని పరిశీలించండి. సంబరపడకండి. వృద్ధిరేటుని జనజీవనానికి అనుసంధానం చేసే కొత్తరాజకీయం కోసం ఆలోచించండి.*

రాష్ట్రాన్ని 2010-11లో వరుసగా వరదలు ముంచెత్తినా వృద్ధిరేటు పరుగులెట్టింది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు జాతీయ సగటును మించి అభివృద్ధిని కనబరచాయి. స్థూల ఉత్పత్తి (జీఎస్‌డిపీ)లో జాతీయవృద్ధిరేటు 8.22 శాతాన్ని అధిగమించి రాష్ట్ర వృద్ధిరేటు 9.22 శాతానికి చేరుకుంది. ఇక రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ॥60,458కి ఎగబాకింది. వ్యవసాయ రంగంలో ఏకంగా 9.10% వృద్ధినమోదు కావటం గమనార్హం. 2009-10లో వ్యవసాయ రంగం వృద్ధిరేటు కేవలం 1.09 శాతానికే పరిమితమయ్యింది. ప్రస్తుత ధరలకు, మూడు ప్రధాన రంగాల్లో కలిపి 2004-05 స్థిర ధరల ప్రకారం మొత్తం రూ॥3.72 లక్షల కోట్ల విలువైన స్థూల ఉత్పత్తి జరిగింది. 2009-10లో ఇది రూ॥3.40 లక్షలకోట్లుగా నమోదైంది.

**పెరుగుదలకు కారణాలు**

**వ్యవసాయం :** వరి, వేరుశనగ పంటలు.. చేపల ఉత్పత్తుల్లో పెరుగుదల.

**పరిశ్రమలు :** మైనింగ్, కార్వియింగ్, నిర్మాణ రంగం, విద్యుత్తు తయారీ రంగాల్లో ప్రగతి.

**సేవలు :** స్థిరాస్థి వ్యాపారం, రవాణా, స్టోరేజి రంగాల్లో పురోగమనం. ఉద్యోగుల జీతభత్యాలు పెరగటంతో ప్రజా నిర్వహణ రంగంలో వృద్ధి. వర్తకం, హోటల్ సేవారంగాలపై వ్యవసాయం, మైనింగ్ విభాగల్లోని పురోగమన ప్రభావం. ■

**స్థూల ఉత్పత్తిలో ప్రధాన రంగాల ప్రగతి (శాతాల్లో)**

| రంగం | రాష్ట్రం | జాతీయం |
|---|---|---|
| వ్యవసాయం | 9.10 | 6.61 |
| పరిశ్రమలు | 8.45 | 7.87 |
| సేవలు | 9.64 | 9.38 |

**స్థూల ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడ్డ కొన్ని విభాగాలు**

| విభాగం | కిందటేడాది కన్నా వృద్ధి (శాతాల్లో) |
|---|---|
| ప్రజా పరిపాలన | 17.32 |
| మత్స్య పరిశ్రమ | 14.15 |
| స్థిరాస్తి, వర్తకం | 11.76 |
| రవాణా, స్టోరేజి | 10.85 |
| నిర్మాణం | 9.68 |
| మైనింగ్, క్వారియింగ్ | 10.15 |

**ప్రధాన రంగాల ఉత్పత్తులు (రూ॥కోట్లలో)**

| రంగం | 2009-10 | 2010-11 |
|---|---|---|
| వ్యవసాయం | 73,633 | 80,330 |
| పరిశ్రమలు | 85,107 | 92,293 |
| సేవలు | 1,81,872 | 1,99,514 |

**తలసరి ఆదాయం పెరుగుదల ఇలా (రూపాయల్లో)**

| సంవత్సరం | తలసరి ఆదాయం | వృద్ధిరేటు |
|---|---|---|
| 2005-06 | 28,539 | 12.7 |
| 2006-07 | 33.135 | 16.1 |
| 2007-08 | 39.727 | 19.9 |
| 2008-09 | 45,007 | 13.3 |
| 2009-10 | 51,025 | 13.4 |
| 2010-11 | 60,458 | 18.49 |

# కేంద్రం 'నగదు బదిలీ' సంక్షేమం

**ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతిని అరికట్టే పేరుతో కేంద్ర ప్రభుత్వం నగదు 'బదిలీ' పథకానికి శ్రీకారం చుడుతోంది. సబ్సిడీలు, రాయితీల సమస్యకి "నగదు" బదిలీ ప్రయోగాలు పలుదేశాలలో పలురకాలుగా అమలులో వున్నాయి. అన్నింటా ఫలితాలు ఒకేలా లేదు. కొన్ని రంగాలలో మంచి ఫలితాలను ఇస్తుంటే మరికొన్ని రంగాలలో వికటిస్తున్నాయి. అందుచేత వెదుక్కీ బియ్యానికీ ఒకే మంత్రంలా కాకుండా ఫలితాలనిచ్చే చోట వీటిని ప్రయోగించడంలో తప్పులేదు. అయితే ఆర్థిక వ్యవస్థకి గుదిబండగా మారిన పథకాలను ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించని రాయితీల పట్ల ప్రభుత్వం తన వైఖరిని పునః సమీక్షించుకోవాలి.**

**ప్రజలకు రకరకాల ఇబ్బందులున్న మాట వాస్తవం. వాటికి ప్రభుత్వతోడ్పాటు ఇవ్వాల్సిన అవసరం కూడా వుంది. అయితే అవి ప్రజల్ని యాచకుల్ని చేసేవి కాకూడదు. ఆర్థిక వ్యవస్థకు, అభివృద్ధికీ అడ్డంకులు కాకూడదు. ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చేవి కావాలి.**

**కాని మన దేశంలో రాజకీయం ఈ సమస్యల్ని అసరా చేసుకుని ఓటు బ్యాంకులుగా మార్చుకోడానికి అడ్డదారిలో జనాకర్షణ పథకాలుగా రూపొందిస్తున్నది. పాత వాటిని వదిలించుకుంటే లేదా భారం తగ్గించుకుంటే కొత్త జనాకర్షణ పథకాలకు దారి దొరుకుతుంది. ఈ ప్రయోగాల తీరు చూస్తే ప్రభుత్వాల దారి అదేలా కనిపిస్తున్నది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన నగదు బదిలీ పథకంలో కొన్ని ముఖ్యాంశాలను ప్రచురిస్తున్నాం.**




ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతిని అరికట్టడానికి విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) చేసిన సిఫార్సుల్లో భాగంగా ప్రభుత్వం తొలుత ఏడు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. తమిళనాడు, అస్సాం, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఒరిస్సా రాష్ట్రాల్లో అక్టోబరు నుంచి పైలట్ ప్రాజెక్టు అమలు చేస్తారు. రాయితీలను నగదు బదిలీ ద్వారా అందజేసే వ్యవస్థను వివరిస్తూ 70 పేజీల మధ్యంతర నివేదికను యూఐడీఏఐ అధ్యక్షుడు నందన్ నిలేకని.. ఆర్థికమంత్రి ప్రణబ్‌ముఖర్జీకి అందజేశారు. ''పైలట్‌ప్రాజెక్టులో సాధకబాధకాలను పరిశీలించి ఈ ఏడాది చివరికి పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తారు" అని ప్రణబ్ విలేకర్లతో చెప్పారు. ప్రభుత్వం ఏటా ఎరువులు, ఇంధన రాయితీకి రూ. 73,637 కోట్లు ఖర్చుపెడుతోంది. కానీ ఇందులో సింహభాగం లబ్ధిదారులకు చేరడం లేదు. వంటగ్యాస్‌పై రాయితీని కొన్ని వర్గాలకే పరిమితం చేయబోతున్నారని, అదీ పరిమిత సంఖ్యలోనే సిలిండర్లు ఇవ్వబోతున్నారని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. నివేదికలోని ముఖ్యాంశాలు...

- సమాచార సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత మౌలిక రాయితీ నిర్వహణ వ్యవస్థ (సీఎస్ఎంఎస్)ను అభివృద్ధి చేయాలి.
- ఈ వ్యవస్థ ద్వారానే లబ్ధిదారుల ఖాతాల్లోకి సరాసరి రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం బదిలీచేయాలి.

- ప్రజాపంపిణీకి సంబంధించిన సమస్త సమాచారం, ఈ వ్యవస్థతో అనుసంధానం చేయాలి. కిరోసిన్, వంటగ్యాస్, ఎరువుల వంటివి ఎప్పుడు, ఏ ప్రదేశాల్లో ఉన్నదీ ఈ వ్యవస్థ ద్వారా నిఘా వేసి ఉంచొచ్చు.
- ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతిని, సరఫరా పక్కదారి పట్టడాన్ని ఈ వ్యవస్థ పసిగడుతుంది.
- అవకతవకలను లబ్ధిదారులు సరాసరి ప్రభుత్వానికి తెలియచేసే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం కూడా సమయానుకూలంగా స్పందించడానికి వీలవుతుంది.
- వంటగ్యాస్‌పై నగదు బదిలీ మూడు అంచల్లో అమలు చేయాలి. రాయితీపై అందించే సిలిండర్ల సంఖ్యపై పరిమితి విధించడం, ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకునే పక్షంలో దీన్ని మొదటి అంచెలో అమలు చేయాలి. రెండో అంచెలో... వినియోగదారుల ఖాతాలకు రాయితీ తాలూకూ నగదు సరాసరి బదిలీ చేయాలి. లక్షిత లబ్ధిదారులను గుర్తించడం, వారికి నగదు బదిలీ చేయడం మూడో అంచెలో జరగాలి. లబ్ధిదారుల వివరాలను, వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యతో అనుసంధానించాలి.
- ఎరువుల విషయంలోనూ మూడంచెల్లో నగదు బదిలీ అమల్లోకి తీసుకొస్తారు. తొలి అంచెలో ఎరువుల తయారీదారుడి నుంచి చిట్టచివరి సరఫరాదారుడి వరకు ఉన్న గొలుసుకట్టు సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. రెండో అంచెలో... ఎరువుల చిల్లర వర్తకుడి ఖాతాకు నగదు బదిలీ చేస్తారు. మూడో అంచెలో సరాసరి రైతు ఖాతాలోకే నగదు బదిలీ చేస్తారు.
- కిరోసిన్‌ను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రాలు పంపిణీ చేస్తున్నందున దీని తాలూకూ నగదు బదిలీ విషయంలో రాష్ట్రాలతో విస్తృత చర్చలు అవసరం. అక్కడ సంస్కరణలు తీసుకురావాలి. తొలి అంచెలో కేంద్రం రాష్ట్రాలకు రాయితీ మొత్తాన్ని అందిస్తుంది. దాన్ని రాష్ట్రాలు లబ్ధిదారుల ఖాతాలో సరాసరి జమచేయాలి. రెండో అంచెలో కేంద్రమే సరాసరి లబ్ధిదారుల ఖాతాలోకి నగదు బదిలీ చేస్తుంది.
- లబ్ధిదారులకు సాధికారిత ఉండాలి. అవకాశముంటే... రాయితీధరలకే వస్తు, సేవలు పొందడమా, లేక నగదు రూపంలో రాయితీ పొందడమా అనే నిర్ణయాధికారం లబ్ధిదారులకే ఇవ్వడం మంచిది. ఫలానా ప్రాంతానికే వచ్చి సంబంధిత సేవలు పొందాలి అని పరిమితులు విధించకుండా ఆయా ప్రదేశాలను లబ్ధిదారులే ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. ■

# వామన కవితలు



**బత్తుల వీ.వెం.అప్పారావు**

నోటిలో ఆకు
ముక్కుల్లో దూది
చివరకు రైతాంగం

పల్లె సుఖపడితే
పట్టణమూ సుఖపడుతుంది
సుఖరోగాలు తగ్గుతాయి

మన తాత ముత్తాతలకి
బి.పి. సుగర్లేవు
వాళ్ళు శ్రమ పునీతులు

తెలుగు బడి పోయె
పలుకుబడీ పోయె
పాపం తెలుగు

సంస్కృతం దేవభాష
ఇంగ్లీష్ దొరభాష
తెలుగు మన భాష కనుక లోకువ

మనం పాజిటివ్‌గా ఆలోచించాలి
హెచ్.ఐ.వి. నెగిటివ్ ఉండాలి

డబ్బున్న కమ్యూనిస్టులు
'అర్థ' కమ్యూనిస్టులు
డబ్బులేని కమ్యూనిస్టులు
'పూర్ణ' కమ్యూనిస్టులు

కొందరిది సహ జీవనం
కొందరిది స్వాహా జీవనం

అమ్మాయిలు కళకళ
వేధింపులకు విల విల

తినేవాడు అతిథి
పెట్టేవాడు పెన్నిధి

భూమికి ఆకర్షణ శక్తి ఉంది
అయినా తారలు దిగిరావు
అందుకే అవి తారలు

గుండెమీద జేబు
గుండెని కంట్రోల్ చేస్తుంది
గుండె జబ్బు వచ్చినా
వైద్యం చేయిస్తుంది

**చిరునామా :**
జి2 మణిమాల ఎస్టేట్, 151 మోతీనగర్,
హైదరాబాద్ - 18, ఫోన్ : 23833798, 23833799

# సంక్షోభంలో పౌర గ్రంథాలయ రంగం



వెలగా వెంకటప్పయ్య

1. గ్రంథాలయ చట్టం జిల్లా గ్రంథాలయ సంస్థలను కార్పొరేట్ ప్రతిపత్తితో సెక్షన్లు 3(3), 9(2) ఏర్పరిస్తే- చట్టం సంస్థలకిచ్చిన అధికారాలను ప్రభుత్వం హరించి వేసి, నిర్వీర్యం చేసింది. నిస్తేజం చేసింది. వీటి పునరుద్ధరణ సంస్థల ప్రథమ కర్తవ్యం. కార్పొరేట్ ప్రతిపత్తి స్వభావం తెలుసుకోవడం, శాసన సభను గౌరవించడం ప్రభుత్వ, పాలకవర్గ బాధ్యత. ఒకే ప్రభుత్వంలో కార్పొరేట్ స్వభావం గల రెండు సంస్థలలో, పాలనా విధానం రెండు తీరులుగా తయారైంది. అనుబంధం - చూడండి.
2. యూనివర్సిటీలవలె కార్పొరేట్ అధికారాలు గల సంస్థలలో- సిబ్బందిని నియమించడం, పుస్తకాలు ఎంపిక చేయడం, కొనడం, భవనాలు నిర్మించడం, వసతులు ఏర్పాటు చేసే అధికారం సంస్థలకే ఉంది. గ్రంథాలయ పరిషత్, డైరెక్టరు, జిల్లా కలెక్టరు, జాయింటు కలెక్టర్లకు లేనే లేదు. దయచేసి చట్టాన్ని ఒకసారి సంప్రదించండి. సంస్థల నిర్వహణకు గ్రంథాలయ పరిషత్ మార్గదర్శక సూత్రాలు అందించాలేగానీ సంస్థలలోని డబ్బు ఖర్చు చేసే మార్గాలు వెతకరాదు. యూనివర్సిటీలకు, కళాశాలలకు కావలసిన సిబ్బందిని, హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్‌గాని, ఉన్నత విద్యాశాఖ గాని నియమించదు. పుస్తకాలు కొనదు. కొనే మార్గదర్శక సూత్రాలు నిర్దేశిస్తుంది. 1988 నుంచి ఈనాటి వరకు పరిషత్ తమ విధి అయిన పుస్తకాల కొనుగోలు విధివిధానం తయారీకి శ్రీకారం చుట్టలేదు. పుస్తకాలు ఎంపికచేసి, కొనే పనిని నడుం కట్టింది. ఇది పరిషత్ బాధ్యత కానేకాదు.
3. చట్టం డైరెక్టరుకు అప్పగించిన కేంద్రీకృత వర్గీకరణ, సూచీకరణ అంతర గ్రంథాలయ సేవ మొ॥విధులు (సెక్షన్ 8-ఎఫ్,హెచ్) విస్మరించి- సంస్థల అధికారాలను కబళించే మార్గం డైరెక్టరు కార్యాలయం ఆలోచిస్తుంది. చట్టంలో కంప్యూటర్ల ప్రసక్తి లేనే లేదు. చట్టాన్ని, నియమాలను సవరించకుండా డైరెక్టరు కార్యాలయం కంప్యూటర్ల ఖర్చుపై వెంపర్లాడుతుంది. దీని ఆంతర్యం అనుహ్యం. "అహం బ్రహ్మాస్మి"- అనేదే డైరెక్టరు కార్యాలయ వేదం.
4. సంస్థల జీవనాధారమైన లైబ్రరీ సెస్సు వసూలు పై డైరెక్టరు దృష్టి పెట్టక, అదనపు గ్రాంట్లపై శ్రద్ధ చూపక, ఉన్న డబ్బు ఖాళీ చేసేందుకు కేంద్రీకృత యత్నాలు చేయడం తగదు. ఇది డైరెక్టరు విధి కాదు. చట్టం వికేంద్రీకరణ కోరుతుంది. కాని డైరెక్టరు కార్యాలయం కేంద్రీకరణవైపు మొగ్గు చూపుతుంది. కేంద్రీకరణ సర్వ అనర్థాలకు మూలం అనేది లోకవిదితం. ఇందుకు గత అనుభవం ప్రబల సాక్ష్యం.
5. విద్యా ప్రగతికి విద్యాసెస్సుతో సంబంధం లేదు. కాని గ్రంథాలయ ప్రగతికి లైబ్రరీ సెస్సుతో ముడిపెట్టడం ఈ రంగానికి శాశ్వత వికలాంగత్వం కల్పించడమే. ఇందుకు విద్యారంగ పెద్దల కబంధ హస్తం లేకపోలేదు. ఈ కుటిల వ్యూహం నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థలు బయటపడందే బతకలేవు.
6. చట్టపరిధిలో గల ప్రయివేటు గ్రంథాలయాలను గ్రంథాలయ పరిషత్, జిల్లా గ్రంథాలయ సంస్థలు, డైరెక్టరు ఉమ్మడిగా విస్మరించి - వాటిని నిర్జీవం చేశారు. మూలాలను మారిచారు. వీటి పరంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ సేవలందించవచ్చనే విషయం పౌర గ్రంథాలయ శాఖకు గుర్తుకు రాదు. స్వావలంబన తెలియదు.
7. సంస్థలలో పనిచేసే సిబ్బంది గత 60 సం॥గా ఒక్క మాసం రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తేదీ జీతాలు తీసుకోలేదు. ఇది డైరెక్టరు కార్యాలయం నిర్వహణా లోపమే. పాఠశాల డైరెక్టరు కార్యాలయంలో సాధ్యమైంది ఎచట ఎందుకు కాదు.

8. గత పాతిక సంవత్సరాలుగా నూతన శాఖ గ్రంథాలయాల స్థాపన, నూతన పోస్టుల సృష్టి జరగలేదు. విద్యాశాఖ ఇలాగే మరుగుజ్జుగా జీవిస్తోందా? పాతికేళ్ళ కాలంలో పాతిక కొత్త యూనివర్సిటీలు వచ్చాయి కదా! వందల సంఖ్యలో కొత్తపోస్టుల సృష్టి జరిగింది కదా. సగటు మనిషికి తోడ్పడే పౌరగ్రంథాలయాలకు ఎందుకీ దుర్గతి.

9. పుస్తకం అచ్చయిన మాసంలో గ్రంథాలయాలకు చేరే అవకాశం లేదు. ప్రభుత్వ ప్రచురణలు గ్రంథాలయాలలో అరుదుగా కనిపిస్తాయి. అనుబంధం-2 కాలదోషం పట్టాకే పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాలను చేరతాయి. ఇవి కాలకూట విషంతో సమానం. పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలు శాఖా గ్రంథాలయాలకు వికేంద్రీకరించడం తక్షణ అవసరం. ఈ అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించకపోతే పౌర గ్రంథాలయ రంగం అధ్ఃపతనం కాకతప్పదు. ఆ మూల్యం పరిషత్ చెల్లించాల్సి వస్తుంది. ఇందు శాంపిల్ పుస్తకాలు అవసరానికి మించి కోరడం ఒక పెద్ద అక్రమ చర్య.

10. గ్రంథాలయ సెస్సు జీతభత్యాలకు వినియోగిచరాదనీ, అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రం వినియోగించాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తరువులను డైరెక్టరు కార్యాలయం ఖాతరు చేయక, సెస్సును జీతభత్యాలకు వినియోగించి, అభివృద్ధి కార్యక్రమాలను విస్మరించినందువలన, సెస్సు వసూలు నీరసించి పోయిందని గమనించాలి. ఇదే నమూనాలో వసూలు చేసే విద్యాసెస్సు నుంచి సిబ్బంది జీతభత్యాలకు వినియోగిస్తున్నారా! ఆలోచించండి! ఎందుకీ వివక్ష!

11. ఒక జిల్లా గ్రంథాలయ సంస్థలు ఏటా 5 లక్షలు రూపాయలు ఇస్తే - అందుకు సమానమైన మొత్తం రాజా రామ్మోహనరాయ్ లైబ్రరీ ఫౌండేషన్ రూ॥5 లక్షల మాచింగ్ గ్రాంటుగా ఇస్తుంది. ఈ పది లక్షల రూ॥ ఖర్చు చేసే అధికారం జిల్లా గ్రంథాలయ సంస్థలదే! అయితే ప్రభుత్వం లేదా పరిషత్ ఇచ్చే మార్గదర్శక సూత్రాల మేరకే సంస్థలు ఖర్చు చేయాలి. కాని సంస్థల ప్రమేయం లేక, సంస్థలను మబ్బులోపెట్టి ఏక పక్షంగా వ్యవహరిస్తూ పరిషత్, డైరెక్టరు కార్యాలయం సంస్థల నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇది అనుచిత చర్య. సంస్థలకు రావలసిన మాచింగ్ గ్రాంటు సంస్థలకు జమపడడం లేదు. ఒకోసారి సంస్థల డబ్బుతో కొన్ని పుస్తకాలు ప్రభుత్వ గ్రంథాలయాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై సమగ్ర విచారణ జరగాలి.

12. కొందరి మెప్పు కోసం పౌర గ్రంథాలయ శాఖ పౌర గ్రంథాలయ రంగానికి చెందనివారితో అపారమైన ఖర్చుతో సదస్సులు, శిక్షణా తరగతులు నిర్వహిస్తుంది. గత సదస్సులు అమలు జరిగిన దాఖలాలు లేవు. నిత్యం పౌర గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు వేదిక శక్తి వారికి లేదు. పైగా చట్టరీత్యా జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులు ఖర్చుచేసే అధికారం డైరెక్టరుకు లేదు. విశ్వవిద్యాలయాల, కళాశాల నిధులను ఉన్నత విద్యాశాఖ డైరెక్టరు ఖర్చు చేయడానికి పూనుకోరని తెలుసుకోవాలి. మరి మన గ్రంథాలయ శాఖ తన విధులను విస్మరించి సదస్సుల కోసం ఆరాటపడుతున్న కారణం జగద్విదితం.

13. సమాచార హక్కు క్రింద డైరెక్టరుగారు ఇచ్చిన సమాచారం ప్రకారం 2009 మార్చి నాటికి సభ్యత్వ దరావతు సొమ్ము 3.47 ఓట్ల రూపాయల వడ్డీలేని ఖాతాలో ఉంచారు. దీన్ని వడ్డీ లభించే ఖాతాలో జమ చేయమని డైరెక్టరుగారి, పరిషత్ ఛైర్మన్ దృష్టికి తెచ్చినా వారు ఈ సూచనను లక్ష్యపెట్టలేదు. ఇందువలన నష్టం ఏడాదికి ఎన్ని లక్షలలో ఉందో గమనించే స్థితిలో అధికార గణం లేదు. ప్రజాధనానికి ఇదొక పెద్ద శాపం.

**ఈ అవ్యవస్థకు ప్రధాన కారణాలు :**

గ్రంథాలయ శాస్త్ర యోగ్యతలు లేని వ్యక్తులు గ్రంథాలయ శాఖకు అధిపత్యం వహించడం. ఇందలి సాంకేతిక ప్రక్రియలపై దృష్టి పెట్టలేక పుస్తకాలు కొనే పని ప్రధానంగా చూడడం. ఇందువలన గ్రంథాలయ శాఖ బజారున పడింది. విశ్వసనీయత కోల్పోయింది. లోప్రొఫైల్‌లో ఈ రంగం కొనసాగుతుంది.

గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ పరిస్థితీ దాదాపు ఇదే - చట్టం ఛైర్మన్‌గా నియమించే వ్యక్తి " The persons who have rendered of eminent service for the cause of education and library movement" అయి ఉండాలి. కాని ప్రభుత్వం చట్టాన్ని సరిగా అమలు జరపడం లేదు. గ్రంథాలయ గడప దొక్కని వారికే ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయి. అక్రమ నియామకపు దుష్ఫలితాలు మనం నేడు కళ్ళారా చూస్తున్నాం.

సమాజంలో అవ్యవస్థత ప్రబలినప్పుడు దాన్ని పరిష్కరింపగలవారు మౌనంగా ఉంటే, ఆ దుష్ఫలితాన్ని అందరం అనుభవించాల్సి వస్తుందని- మహాభారతం చెబుతుంది. ఇది ఈ నాటికీ సత్యవచనమే మరి! ■



| రచయిత చిరునామా: | ఐతానగరం, తెనాలి 522 201 సెల్ : 94904 49555 |
|---|---|

# చదువులేని వారు 2.11 కోట్లు

- తెలంగాణలో 91.81 లక్షల మంది
- రాయలసీమలో 32.87 లక్షలు
- ఆంధ్రాలో 86.35 లక్షల మంది
- స్వతంత్రం వచ్చి 60 ఏళ్ళు దాటినా ఫలించని లక్ష్యం
- సంపూర్ణ అక్షరాస్యత సాధించడంలో సర్కారు విఫలం

స్వతంత్రం వచ్చి 60 సంవత్సరాలు దాటి పోయినప్పటికీ కూడా రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడంలో సర్కారు విఫలం అయింది. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా గతంలో అనేక ప్రభుత్వాలు పనిచేసినప్పటికీ ఫలితాలు శూన్యాన్ని చూపిస్తున్నాయి. సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం ఇప్పటివరకు వేలాది కోట్లు ఖర్చయ్యాయే కాని, దానికి సంబంధించిన ఫలాలు మాత్రం కరువయ్యాయి. ఇప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నది. 15 సంవత్సరాలు దాటిన వారిని లెక్కించిన తర్వాత ఈ వివరాలను సాక్షరభారత్ విడుదల చేసింది.

ఇప్పటి వరకు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో నిరక్షరాస్యులు 2,11,04,745 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో పురుషుల వారి కంటే స్త్రీలలోనే నిరక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉన్నట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో పురుషులు 77,01,429 మంది, స్త్రీలు 93,11,999 మంది ఉన్నట్లు సాక్షర భారత్ సర్వే ఫలితాలు తెలుపుతున్నాయి. అలాగే తెలంగాణలోని పది జిల్లాల్లో అత్యధికంగా 91,81,710 మంది చదువు లేనివారు ఉన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలు కలిపి 32,87,060 మంది ఆంధ్రాలో 86,35,975 మంది చొప్పున ఉన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో జిల్లాల ప్రాతిపదికన చూసినట్లయితే తెలంగాణ ప్రాంతంలోనే చదువులేని వారు అధిక సంఖ్యలో నమోదయ్యారు. ఆ తర్వాత ఆంధ్రాలో, మూడో స్థానంలో రాయలసీమ చదువులో వెనకబాటుతనాన్ని చూపిస్తోంది. జిల్లాల వారీగా చూసినట్లయితే... చదువులేని వారి సంఖ్య తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాల్లో 14,94,793 మంది ఉన్నారు. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా ఉన్నది. వైఎస్ఆర్ కడప జిల్లాల్లో 5,24,042 మంది మాత్రమే చదువులేని వారు ఉన్నట్లు లెక్కలు వివరిస్తున్నాయి. ఈ క్రమంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే మరో 30 సంవత్సరాలు అయినా సరిపోయే అవకాశాలు లేవని విద్యావేత్తలు, సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ■



**జిల్లాల వారీగా చదువులేని వారి సంఖ్య వివరాలు**

| జిల్లాపేరు | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| ఆంధ్ర ప్రాంతం | | | |
| శ్రీకాకుళం | 5,41,866 | 5,62,763 | 10,77,629 |
| విజయనగరం | 3,25,473 | 4,14,059 | 7,39,532 |
| విశాఖపట్నం | 4,02,921 | 4,62,138 | 8,65,059 |
| గుంటూరు | 4,57,580 | 5,27,992 | 9,85,572 |
| ప్రకాశం | 3,62,803 | 4,68,687 | 8,31,490 |
| నెల్లూరు | 3,14,543 | 3,70,189 | 6,84,732 |
| తూ.గోదావరి | 6,17,869 | 8,25,469 | 14,43,338 |
| ప.గోదావరి | 3,48,966 | 5,06,422 | 8,55,388 |
| కృష్ణ | 4,70,503 | 6,82,732 | 11,53,235 |
| తెలంగాణ ప్రాంతం | | | |
| మహబూబ్‌నగర్ | 6,86,861 | 8,07,932 | 14,94,793 |
| రంగారెడ్డి | 3,38,000 | 3,86,000 | 7,24,000 |
| మెదక్ | 3,86,715 | 4,83,715 | 8,72,941 |
| నిజామాబాద్ | 3,47,129 | 4,25,812 | 7,72,941 |
| కరీంనగర్ | 4,78,779 | 5,52,607 | 10,31,386 |
| వరంగల్ | 4,86,757 | 5,41,699 | 10,28,456 |
| ఖమ్మం | 3,36,300 | 3,59,460 | 6,95,760 |
| నల్గొండ | 4,12,251 | 5,24,665 | 9,36,916 |
| అదిలాబాద్ | 3,59,376 | 6,28,299 | 9,87,672 |
| హైదరాబాద్ | 2,42,251 | 3,97,105 | 6,39,356 |
| రాయలసీమ ప్రాంతం | | | |
| చిత్తూరు | 4,01,076 | 5,40,631 | 9,41,707 |
| కడప | 2,76,858 | 3,44,410 | 6,21,268 |
| అనంతపురం | 2,33,310 | 2,90,732 | 5,24,042 |
| కర్నూల్ | 5,79,831 | 6,20,212 | 12,00,043 |
| మొత్తం | **77,01,429** | **93,11,999** | **2,11,04,746** |

# బతుకులెట్ల తెల్లారాలె

- కొంగర గంగాధరరావు

'లేస్తేనే మనిషినికాను' అన్న కెసిఆర్ నిద్రలేసిండు. లేసిందే తడవుగా హడావిడిగా జానారెడ్డి ఇంటి తలుపు తట్టిండు. 'నువ్వు ఇంద్రుడివి, చంద్రుడివి' అన్నడు. ఇంకేం జానారెడ్డికి ఉత్సాహం, ఉద్రేకం ఒకేసారి పొంగుకొచ్చినయి. అప్పుడెప్పుడో చిన్నతనంలో తీసేసిన మీసాలు (నేనైతే ఎప్పుడూ చూడలేదు) గుర్తుకొచ్చి ఒక్కసారి మెలేసిండు. వెంటనే పెద్దాయన కేశవరావుకి కబురు పంపిండు, ఆఘమేఘాలపై పంచె సర్దుకొని పరిగెత్తుకొచ్చిండు కేశవరావు 'టాట్, అధిష్ఠానానికి బుద్ధి చెప్పాల్సిందే' అన్నాడు. 'మన తడాఖా చూపిస్తే ఢిల్లీ నాయకత్వం దిగిరాక తప్పదన్నాడు. (ఇంతకీ ఈయనకి అదిష్ఠానం మీద కోపమెందుకో తెలియదు). తెలంగాణ ఏర్పాటుకి మనమే ముహూర్తం పెట్టాలన్నరు. ముసిముసిగా నవ్వుకున్నడు కెసిఆర్. ఎందుకు నవ్వుతున్నవంటే మీ సంఘీంభావం చూసి నాకు ముచ్చటేసిందన్నడు. 'మరెప్పుడు మీ నిర్ణయం' అన్నడు. ఇగో ఈ జూలై ఒకటిన అందరం కూసుంటం. మా నిర్ణయాన్ని చెబుతం అన్నారు జానా, కెకె. 'యెన్కకు పోరుగద' అనుమానంగా అడిగిండు కేసిఆర్. 'లే.లే. ఆరునూరైనా మాట తప్పం. ఇగ జూసుకో మా తడాఖా' భరోసా ఇచ్చిన్రు జానా, కెకె. 'అయితే జర గదే మాట ప్రెస్సోళ్ళకి జెప్పుండ్రి' అన్నడు కెసిఆర్. రొమ్ము ఇరుసుకొని బయటకు వచ్చింరు జానా, కెకె. వెనకనే ఫాలో అయ్యిండు కెసిఆర్.

ప్రెస్సోళ్ళని జూడంగనె శివాలెత్తిండ్రు జానా, కెకె. 'తెలంగాణ తెచ్చేటోళ్ళము, ఇచ్చేటోళ్ళము మేమే' అన్నరు. జూలై 1న మీటింగ్ పెట్టుకొని డిసైడ్ జేస్తం అన్నరు. అవసరమైతే రిజైన్ చేయనీకె వెనుకాడేది లేదన్నరు. మల్ల ముసి ముసిగ నవ్వుకున్నడు కె.సి.ఆర్. 'ఇగ అస్తనే' జానాకు, కెకెకు వీడ్కోలు చెప్పి బయలు దేరిండు కెసిఆర్.

లోపలకు పోయినంక పిసుక్కున్నడు జానా. ధైర్యం జెప్పిండు కెకె. 'మేమంత నీవెంట వున్నం' ఏం గాదు తియ్యి' అన్నడు.

జూలై 1 వచ్చింది. దామన్న (దామోదరరెడ్డి), యాదన్న (యాదవరెడ్డి) తోడైండ్రు. ఇంక మస్తుగ కాంగ్రెస్ తెలంగాణ లీడర్లు వచ్చిండ్రు. 'జై తెలంగాణ' అన్నరు. తెలంగాణ భవన్ దాక ఇనవడ్లే. కేసీఆర్‌కు అనుమానమొచ్చింది. కోదండరాంకు ఫోన్ జేసిండు పరుగున పోయిండు కోదండరాం. 'నే వచ్చిన' అని కబురు పెట్టిండు కెకెకు. 'ఛట్, గాయనొస్తె మేముండం' అన్నడు సుధన్న (సుధాకరరెడ్డి). కోదండరాంకు సముదాయించిండు కెకె. 'గట్లన. అయితే నిర్ణయం తేలే వరకు మేమీడికెల్లి కదలం' అని ఆఫీస్ రూంలనే బైఠాయించిండు కోదండరాం.

ఇగ నిర్ణయం అయిపోయింది. జూలై 4న అందరం 11 గొట్టంగ రాజీనామా చేద్దామని తీర్మానం జేసిండ్రు. ఎవళ్ళైనా ఒక్కళ్ళిద్దరు నసిగితే 'అగో గులాంనబీ ఆజాద్ జూడు. మనమందరం గీడ సమావేశం పెట్టుకొంటే మనల్ని కనీసం పరకరించకుండా గా సీమాంధ్ర చిరంజీవి దగ్గరకు పోయి విందులు విలాసాలతో కాలంగడిపిండు. ఇంకేంది మన ఇజ్జత్. మనం రాజీనామ చేయాల్సిందే' అన్నరు. తృప్తిగా ఆడికెల్లి కదిలిండు కోదండరాం.

ఫుల్‌గా ఖుషీ అయిండు నాగమన్న. ఆగమయిపోయిందను కున్న తనలైను రెండు రోజుల దీక్షతో మల్ల పట్టాలెక్కంగనె జూలై 3నే తన ముగ్గురు ఎమ్మెల్యేలతో కలిసి రాజీనామ చేసిండు. పరేషానైండు చంద్రన్న. గిదెందో మంచిగనే వున్నదనుకున్నడు. ఎర్రబెల్లిని పిలిపించిండు. మనోల్లందరినీ గూడా రాజీనామ చేపించమని చెప్పిండు. 'గా కాంగ్రెసోళ్ళు చేసినంక జేద్దమనుకున్నంగద' అనుమానంగా అన్నడు ఎర్రబెల్లి. 'లే. మనమే ముందర జెయ్యాలె' చెప్పిండు సెంద్రన్న. ఉత్సాహంగా లేసిండు ఎర్రబెల్లి. 'జై తెలంగాణ' అన్నడు. తెలంగాణ తెలుగుదేస పోల్లందరు రాజీనామా జేసిండ్రు. గప్పటికే, విస్నన్న (విష్ణువర్ధన్‌రెడ్డి) రాజీనామా జేసిండు. గీనెందుకు గిప్పుడు రాజీనామా చేసిండన్న వోల్లకు దానమన్న (దానం నాగేందర్) మాటలు గుర్తుకొచ్చినయి. గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు రాజీనామా జేయరని దానం వకాల్త పుచ్చుకునుడు విస్నన్నకు నచ్చలే.

అటు జగనన్న జూసిండు. ఎందుకైన మంచిదని సురేఖమ్మకు రాజీనామా జేయమని జెప్పిండు. జై తెలంగాణ

అన్నది సురేఖమ్మ. కాంగ్రెసోల్ల కంటె ముందే రాజీనామా చేసింది.

ఇగ ఢిల్లీ కెల్లి ఫోన్లు వచ్చినయి. గీడవున్నప్పుడు పలకరీయనీకే చాతకాని ఆజాద్ వెంటనే ఢిల్లీ రమ్మని జానాకు జెప్పిండు. రాజీనామాలు జేయవద్దన్నడు. గాని ఈల్లు ఇనలే. ముందు రాజీనామాలు ఆ తరవాతనే చర్చలు అన్నరు. అందరు కలిసి రాజీనామా జేసింగ్రు.

మల్ల గిదేటో పోయేటట్టున్నది అని రాత్రి 2 గొట్టంగ కేసీఆర్ రాజీనామా జేసిండు. పొద్దుగాల్ల విజయశాంతి రాజీనామా చేసింది. మధ్యాన్నపుటేలకు టిఆరెస్సోల్లందరు రాజీనామా జేసింగ్రు. అమెరికాలో వున్న నారాయణ పర్మిసన్ తీసుకుని సిపిఐవోల్లు రాజీనామా జేసింగ్రు. ఇగ బిజేపీ ఓళ్లుగూడా జేసింగ్రు.

ఢిల్లీ పోయింగ్రు జానా, కెకె. వెంట పోయింగ్రు పొన్నాల, పొన్నం. యాస్కీ అమెరికా కెల్లి తిరిగి వచ్చిండు. అందర్ని మస్తుగ తిట్టిండు ప్రణబ్. 'ఏం తమాషా జేస్తున్నర' కళ్ళెర్ర జేసిండు అహ్మద్‌పటేల్. 'నేను జోకర్ తిరగ కనపడుతున్నన' క్లాస్ పీకిండు ఆజాద్. డీల పడ్డరు మనోళ్ళు. ఈల్లను జూసి ఆల్లకు జాలేసింది. సరే. మేమేదో మాట్లాడతం. మీరు వోయి రాజీనామాలుపసంహరించుకోండి. హుకుం జారీ చేసింగ్రు పెద్దోళ్ళు. మెల్లగ తిరుగు ప్రయానం అయ్యింగ్రు మనోల్లు.

'ఈడికి అచ్చినంక తెలంగాణ యియ్యకుంటే మొదటి ముద్దాయి కాంగ్రెసె' అన్నడు పొన్నం. అన్నంక నాల్క కరుసుకున్నడు. 'లే. నేనట్ల అనలే' అన్నడు. మేమందరం రాజీనామాలు జేసినం. ఉద్యోగులు కూడ జెయ్యాలె అన్నడు.

ఇగ కెసిఆర్ మస్తు ఖుషీగ ఉన్నడు. ఉద్యమం మల్లరాజుకున్నది. యూనివర్సిటీల విద్యార్థులకు, పోలీసులకు మధ్య యుద్ధం. ఎక్కడి బస్సులు అక్కడ తిరగలే. పిల్లలు స్కూలుకు పోలె. కాలేజీలు మూతపడ్డయి. కెసిఆర్ దెబ్బకు మంత్రులందరు రాజీనామా జేసింగ్రు. రాజీనామా జేసి నోళ్ళు డూటీ చేస్తే వాతలు పెడతం అన్నడు కోదండరాం. దెబ్బకు చేవెళ్ళ చెల్లెమ్మ సహా అందరు సచివాలయంకు రావుడు బంజేసింగ్రు. ఎక్కడి ఫైళ్ళు అక్కడనే. ఎక్కడి సమస్యలు అక్కడనే.

సెంద్రన్న మస్తు మజా జేస్తున్నడు. తన రెండు కళ్ళ సిద్ధాంతం పక్కకు పోయి ఇప్పుడు మల్ల తెలంగానల తనోళ్ళు బస్సు యాత్ర పెట్టుకుంటే సంతోషంగా జెండా ఊపిండు. రాత్రి రెండు గొట్టంగ కెసిఆర్‌కు ఫోన్ చేసి థాంక్స్ జెప్పిండు. 'గరే. గా దానిదేముంది బయ్. నువ్విప్పుడు తట్టా బుట్టా సర్దుకుంటే నా దుకానం ఎట్లా నడవాలె. గందుకే నీ కింత ఆక్సిజన్ ఇచ్చిన అన్నడు కెసిఆర్.

మరి మేము కూడ పెన్‌డౌన్ అన్నరు ఉద్యోగులు. లే. సహాయ నిరాకరణ అన్నరు ఇంకొందరు. అన్నీ రాజకీయ జేఏసిలు లేసికూసున్నయి. ఇటు తెలంగాణల, అటు ఆంధ్రల.

ఇసాక పట్నంల మీటింగ్ పెట్టిండు జేపీ. ప్రెస్సోళ్ళు అడిగింగ్రు తెలంగాణపై మీ అభిప్రాయం ఏందని ? 'జాతీయ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నది. ఇది నేరం. వెంటనే తెలంగాణ విషయం తేల్చేయాలి' అన్నరు జేపీ. లే తెలంగాణపై మీ అభిప్రాయం జెప్పుంగ్రి అన్నరు ప్రెస్సోళ్ళు. 'తెలంగాణ ఇస్తే ఆంధ్రల ఉపద్రవం రాదు' అన్నడు జేపీ ! 'లే. తెలంగాణ కావాలని తెలంగాణల అందరు అడుగుతున్నరు గద దాని మీద మీ అభిప్రాయం జెప్పుండి', అన్నరు ప్రెస్సోళ్ళు. 'తెలంగాణ రాష్ట్రం తెలంగాణ ప్రజలకు వరదాయినికాదు. రాష్ట్రం రాంగనె తెలంగాణ ప్రజల సమస్యలన్నీ తీరిపోవు' అన్నరు. 'మరి ఇంతకీ మీరేం జెప్పదలుచుకున్నరు'. విసుగ్గ అడిగింగ్రు ప్రెస్సోళ్ళు. 'జిల్లా ప్రభుత్వాల ఏర్పాటే అన్ని సమస్యలకు పరిష్కారం. స్థానిక సమస్యలకు స్థానికంగానే పరిష్కారం దొరికినప్పుడు ఢిల్లీకి, గల్లీకి సంబంధం లేనప్పుడు గల్లీ ప్రజలు సంతోషంగ వుంటరు' అన్నడు జేపీ. 'ఏందో ఈన జెప్పేది ఒక్కటీ అర్థంకాదు' బుర్రగోక్కున్నరు ప్రెస్సోళ్ళు.

అటి తిరిగి ఇటు తిరిగి కాంగ్రెసోళ్ళకే కష్టాలు వచ్చినయి. తెలంగాన ఇస్తె ఆంధ్రల నష్టం. ఇవ్వకుంటె తెలంగాణలనష్టం. ఏం జెయ్యాలె. బుర్రగోక్కున్న మన్మోహన్‌కు గురువు గుర్తుకొచ్చిండు. 'పివి ఫార్ములా' అన్నడు. కోర్ కమిటీల సీరియస్‌గ డిస్కస్ చేస్తున్న సోనియమ్మకు కోపమొచ్చింది. మన్మోహన్ వంక సీరియస్‌గ జూసింది. అంతలనే నవ్వింది. 'ఔ. గంతే' అన్నది. పీవీ పేరు ఉచ్చరించడం ఇష్టంలేనట్లు.

'ఇంతకీ తెలంగాన అస్తున్నద 'అడిగిండు మల్లయ్య. 'తెల్వదు' జెప్పిండు సారు. 'అదేంది సారూ. సదుకున్నోనివి నీకు కూడ తెల్వద 'అన్నడు మల్లయ్య'. 'లేదు మల్లయ్య'. గిది సదుకున్నల్లకి తెలిసేది కాదు'. సర్దుకున్నడు సారు.

'ఇగ మా బతుకులెట్ల తెల్లారాలె' గొణుక్కున్నడు మల్లయ్య. ■

# జనాన్ని కదిలించడం ఎలా?



డా॥ వి. బ్రహ్మారెడ్డి

జనం కోసం ఏ మంచిపని జరగాలన్నా జనం కదలాలి. జనం కదలకుండా పైనుంచి జనం కోసం మంచిని దిగుమతి చేయవచ్చు. అలా చేస్తే జనం ఎప్పుడూ 'తీసుకునేవారు'గా ఉంటారు. మనం 'ఇచ్చేవాళ్ళు'గా ఉంటాం. 'జనానికి రోజూ పిడికెడు అన్నం పెట్టటం మేలా? ఆ పిడికెడు అన్నాన్ని వాళ్ళే సంపాదించుకోవటం ఎలాగో నేర్పటం మేలా?' జవాబు స్పష్టం అందుకే జనానికి మేలు జరుగుతుందనుకునే ప్రతి కార్యక్రమం లోనూ జనం కల్పించుకోవటం మంచిది, అవసరం కూడా.

**జనం కదలాలి అంటే ?**

ఎలా అయితే కదులుతారో మనకు తెలియాలి.

**మనకు తెలియాలంటే ?**

జనం మనతో మనసు విప్పి మాట్లాడాలి.

**మాట్లాడాలంటే ?**

ముందు తమ మౌన సంస్కృతి నుంచి బయటకు రావాలి.

**రావాలంటే ?**

వాళ్ళు మనల్ని నమ్మాలి.

**నమ్మాలంటే ?**

నమ్మేట్లుగా మన ప్రవర్తనా వేషభాషలూ అన్నీ ఉండాలి.

**ఉండాలంటే ?**

మనం జనాన్ని నమ్మాలి.

అభిమానించాలి, ప్రేమించగల్గాలి.

వారి తప్పుల్ని అర్థం చేసుకోగల్గాలి.

ప్రజల శక్తిసామర్థ్యాల మీద విశ్వాసముంచాలి.

ఈ క్రమంలో ఇమిడి ఉన్న అంశాలు చూద్దాం.

## ప్రజలు మౌనంగా ఉన్నారు

ప్రజలు మౌన సంస్కృతిలో ఉన్నారు. బలం ఉన్నవాని ముందు బలం లేనివారు మౌనంగా ఉంటారు. చదువుకున్న వారి ముందు చదువు రానివారూ, డబ్బున్న వారి ముందు డబ్బు లేనివారూ, అధికారమున్న వారి ముందు అధికారం లేనివారూ మౌనంగా ఉంటారు. చదువు లేనివారే అని కాదు. విషయం తెలియనివారు కూడా తెలిసినవారి ముందు మౌనంగా ఉంటారు.

డాక్టరుముందు వైద్యం గురించి ఇతరులు మౌనంగా ఉంటారు.

ఇదే డాక్టరు ఇంజనీరు ముందు మౌనం.

ఇదే ఇంజనీరు లెక్చరర్ ముందు మౌనం

ఇదే లెక్చరర్ స్కూటర్ మెకానిక్ ముందు మౌనం

ఇదింతే..

ఈ బలాల్లో కొన్ని బలాలు జనానికి ఉండకపోవచ్చు. వాటి విషయానికి వస్తే ఆయా బలాలు గల వారి ముందు జనం మౌనంగా ఉంటారు. జనానికి 'ఇంకొన్ని బలాలు అదనంగా ఉండి ఉండవచ్చు గదా' అనే విషయాన్ని జనాలతో వ్యవహరించేవారు మర్చిపో కూడదు.

మౌనంగా ఉన్న జనం మనతో స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితిని సాధించాలి. ఇది జరిగేదాకా జనం గురించి మనకు ఏమీ అర్థం గాదు.

ఉదా : బహిరంగ సభ పెట్టాము. గంటో, రెండు గంటలో చక్కగా మాట్లాడుతాము. మాట్లాడామని మనం అనుకుంటాము. జనం కూడా అలాగే అనుకున్నారా? లేదా? అసలు మనం మాట్లాడింది వాళ్ళకు అర్థమయిందా? లేదా? వాళ్ళేం చేయదల్చుకున్నారు? ఇవన్నీ మనకు తెలియదు. ఎందుకంటే మీటింగు అయ్యాక జనం మౌనంగా వెళ్ళిపోయారు కాబట్టి.

## జనానికి తెలివితేటలున్నాయా? లేదా ?

ఒక గ్రామంలో ఒక ప్రాజెక్టు నిర్మాణానికి పెద్ద బండరాయి అడ్డం వచ్చింది. దాన్ని తొలగించటానికి కాంట్రాక్టరు గారు 2 లక్షల రూపాయలకు టెండరు వేశారు. 'అది న్యాయమే' అని ఇంజనీర్లూ భావించారు. ఆ ప్రాంతం గిరిజనులు ఉండే ప్రాంతం. చదువు కూడా ఆ జనానికి సరిగ్గా లేదు. 'మాకు పదివేలివ్వండి.

మేము ఆ బండను తొలగిస్తాం' అన్నారు.

ఎలా చేస్తారో చూద్దాం అని పదివేలు అక్కడున్న అధికారులు ఇప్పించారు. 5వేల రూపాయలకు కిరసనాయిలు కొనుక్కొచ్చారు. కొంత కిరసనాయిలు బండమీద పోసి నిప్పంటించారు. బాగా కాలిన తర్వాత నీళ్ళు పోశారు. బండ మీద నెర్రెలు వచ్చాయి. ఆ నెర్రెల్లో మరలా కిరసనాయిలు పోసి నిప్పంటించారు. ఇలా నాలుగైదు సార్లు చేసే సరికి రాయి చిన్న చిన్న ముక్కలయ్యింది. వాటన్నింటినీ ఎత్తి అవతల పారేశారు.

ఈ రోజు వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేసే చెరువులు, కట్టలు, చెట్ల పెంపకం వీటి గురించి ఎప్పట్నుంచో మన జనానికి తెలుసు. 5-6 శతాబ్దాల క్రితం విజయనగరం సామ్రాజ్య కాలంలో మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలలో విపరీతంగా చెరువుల నిర్మాణం జరిగింది. మహామంత్రి తిమ్మరుసు కాలంలో కూడా చెరువుల నిర్మాణం విపరీతంగా జరిగింది. ఉదా : కంభం చెరువు, బుక్కపట్నం చెరువు.

జనానికి విజ్ఞానం ఉంది. అదెంత నామమాత్రంగా ఉన్నా దాన్ని మనం గుర్తించాలి. దాన్ని గమనంలో ఉంచుకుని తాజా విజ్ఞానాన్ని వాళ్ళ జ్ఞానానికి అనుసంధానం చేస్తే జనం బాగా స్పందిస్తారు. మనం చెప్పేదంతా కొత్తగా కన్పించదు. అంతా కొత్తగా అన్పించితే జనం బెరుకుపడి దూరంగా ఉండవచ్చు.

## జనం ఎప్పుడు నమ్ముతారు ?

జనం గమనిస్తూ ఉంటారు. అయితే తొందరపడి మాట్లాడరు. మాట్లాడరు కాబట్టి అది 'అర్ధ అంగీకారమూ' కాదు, 'అంగీకారమూ' కాదు. సామాన్యంగా ఉన్న వాళ్ళను, నీతిమంతులను, సామర్థ్యం ఉన్న వారినీ, పటాటోపం లేనివారినీ, తమమీద అభిమానం కలవారినీ.. ఈ లక్షణాలు అన్నీ లేకపోయినా, కొన్నైనా కలవారిని నాయకులుగా జనం అంగీకరిస్తారు. వారిని నమ్ముతారు. వారి ముందు మాట్లాడుతారు. కాంగ్రెస్‌లో గాంధీని, జనతాలో జయప్రకాష్‌నూ, కమ్యూనిస్టులలో సుందరయ్యనూ, బిజెపిలో వాజ్‌పాయినీ జనం అలా చూస్తారు. అవే పార్టీల్లో అనేక మంది ఉంటారు. ఆ అనేక మందికి వీళ్ళంత గౌరవం జనం ఇవ్వకపోవచ్చు. ఎందుకో మనకు తెలుసు.

మనం జనం దగ్గరకు పోయినపుడు మనకు చాలా తెలుసని బడాయి పోవటాన్ని జనం హర్షించరు. అంటే ఏదో చేస్తారని కాదు, నోరు విప్పరు. ఎక్కడబడితే అక్కడ కూర్చోగలిగితే, వాళ్ళు పెట్టేది తినగలిగితే, వాళ్ళు ఇచ్చేది త్రాగగలిగితే, వాళ్ళతో పాటు నడిచి తిరుగుతూంటే వాళ్ళ ఇళ్ళల్లోనే ఉండగలిగితే, వాళ్ళలాంటి జీవనం (అదెంత తక్కువ కాలమైనా) గడపగలిగితే జనం మనల్ని గుర్తిస్తారు. తమతో కలిసిపోయే వ్యక్తులుగా మనల్ని గుర్తిస్తారు. మనము చెప్పేదీ వింటారు. వాళ్ళ మనసులు విప్పి మనముందు ఉంచగలుగుతారు.

## నాయకుల బలహీనతలు

బలహీనతలు జనానికి ఉన్నాయి, నాయకులకూడా బలహీనతలుంటాయని జనానికి తెలుసు. ఆ బలహీనతల్ని దాచిపెట్టి నటించేవాళ్ళను వాళ్ళ అనుభవంతో తేలిగ్గా కనిపెడ్తారు. మనకుండేంత హిపోక్రసీ (నటన) వారికుండదు.

**ఉదా:** ఒక డాక్టరు గొప్ప సర్జను, ఆయన ఆ పట్టణానికి మొదటగా బ్లూఫిలింలు తెచ్చి దించాడు. అదాయన బలహీనత. జనం ఆయన బలహీనతను భరించారు. ఆయన్ను సర్జనుగా వినియోగించు కుంటూనే వున్నారు. సర్జను యొక్క బలహీనతనూ, బలాన్నీ విడదీసి చూడగల శక్తీ, నేర్పూ జనానికుందన్నమాట. ఒక ఫ్యాక్షన్ నాయకుడు తన ఖాతాలో 10 ఖూనీలు జమ చేసుకొని వుంటాడు. ఆ సంగతి జనానికి తెలుసు. జనానికి పనులు చేసిపెడ్తాడు. కేవలం భయంతోనే అతని దగ్గరకు చేరరు. అతగాడ్ని అభిమానించేవాళ్ళూ ఉంటారు. జనం తమ సమస్యలు పరిష్కరించుకోవటానికి తమకు చేతనైన మార్గాలు వెతుక్కుంటారు. 'ఆధారపడినవారుగా' ఉండటం సూత్రప్రాయంగా వారికి అంగీకారం కాదు. తాము వెతుక్కొన్న మార్గం పని చేయకపోతే మరో మార్గం వెతుక్కుంటారు. అమీబాకు ఏదయినా అడ్డు వస్తే ఆ అడ్డం మీద యుద్ధం చేయదు ప్రక్కకు తప్పుకొని పోతుంది. అలాగే జనం కూడా. సమస్య పరిష్కారంలో అడ్డంకి వస్తే మరో మార్గం వెతుకుతారు. వీలయినంతవరకు అంతిమ పోరాటానికి సిద్ధం కారు.

**ఉదా :** స్కూలుకు టీచర్ సరిగ్గా రాకపోతే తమ పిల్లల్ని కాన్వెంటుకు పంపుతారు, లేదా ట్యూషను మాష్టారు దగ్గరకు పంపుతారు. స్కూలు టీచరు మీద యుద్ధం ప్రకటించరు. ఆ స్కూల్ టీచరు వెనుక యూనియన్ ఉంది, రాజకీయ నాయకులు ఉన్నారు, అందుకనే సర్దుకుంటారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు డాక్టర్ రాకపోతే పట్టించుకోరు. ప్రైవేటు డాక్టరు దగ్గరకు పోతారు.

## జనం ఎప్పుడు కదుల్తారు ?

**ఎ.** జనం తమ సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో అన్ని దారులూ మూసుకుపోతే కదుల్తారు. **ఉదా** : ధరలు పెరుగుతున్నాయి. తగ్గించటం చేతకాదు, కూలిరేట్లు పెరగటం లేదు, వచ్చిన కూలి కూడా తమ భర్తలు త్రాగటానికే చాలటం లేదు. తాము సంపాదించిన దానిని కూడా త్రాగుడు కోసం లాక్కుంటున్నారు. వేరే మార్గం లేదు. నెల్లూరులో మహిళలు కదిలారు. నెల్లూరులోనే ఎందుకు కదిలారు? అక్షరాస్యతా ఉద్యమం స్త్రీలను రోజూ ఒకచోట చేర్చింది. బాధలు కలబోసుకుని మాట్లాడుకునే క్రమంలో అవగాహన కల్గింది. అవగాహన ఆచరణకు మార్గం వేసింది.

**బి.** ఎవరైనా సెంటిమెంట్ల మీద, ఆవేశకావేశాలు రెచ్చగొడితే కదుల్తారు.

ఉదా : మతఘర్షణలు, కులకొట్లాటలు, బాబ్రీమసీదు కూల్చివేత

**సి.** స్పాంటేనియస్ ఉద్యమాలు : ప్లాన్డ్ ఉద్యమాలు

జనం తమంతట తాము కదిలితే స్పాంటేనియస్ మూమెంట్ అంటాము. మరెవరో జనం కోసం ప్లాను చేసి జనాన్ని కదిలిస్తే ప్లాన్డ్ మూమెంట్ అంటాము. రెండింటిలోనూ ఎంతో కొంత అవగాహన (అది సరైన దారిలో కాని, తప్పుడు దారిలో కాని) జనానికి ఉంటుంది.

జనానికి అవగాహన పెరిగినకొద్దీ, తమకు ఏం కావాలి ? అదెలా వస్తుంది ? అందులో కలిసొచ్చేదెవరు ? ఎవరికి వ్యతిరేకంగా ? ఎంతకాలం ? ఎలా ఉద్యమించాలి ? తప్పనిసరైతే ఎలా వెనక్కు తగ్గాలి? ఇవన్నీ అర్థమవుతాయి. అయితే జనం యొక్క 'అవసరం' లోంచి ఉద్యమం బయలుదేరితే ఆ ఉద్యమాలకు బలమెక్కువ, ఎక్కువకాలమైనా కొనసాగగలిగే స్వభావం ఎక్కువ.

## జనం యొక్క అవసరం

దీన్నే Felt Need అంటాము. అధిక ధరలు జనాన్ని బాధించేవే. రాజకీయపార్టీల కార్యకర్తలు అధిక ధరలకు వ్యతిరేకంగా ఊరేగింపు తీస్తారు. కార్యకర్తలే పాల్గొంటారు. జనం ఫుట్‌పాత్‌ల మీద నిలబడి చోద్యం చూస్తుంటారు. మా ఊరేగింపు బ్రహ్మాండంగా విజయవంతం అయిందని పార్టీ నాయకులు స్టేట్‌మెంటు ఇస్తారు. 'వాళ్ళిలాగే ఊరేగింపులు తీస్తారు, తెల్లారేసరికంతా ధరలు మరలా పెరుగుతాయి' అని జనం అనుకుంటారు.

ఊరేగింపుల ద్వారా ధరలు తగ్గుతాయని జనం 'నమ్మటం' లేదు. అసలు ఏ విధంగా కూడా ధరలు తగ్గుతాయని జనం నమ్మటం లేదు.

బస్‌ఛార్జీలు పెరుగుతున్నాయని 'రాజకీయ పార్టీలు' ధర్నా చేస్తారు. జనం రారు.

నిరుద్యోగానికి వ్యతిరేకంగా బహిరంగసభ జరుపుతారు, పార్టీల కార్యకర్తలే వస్తారు, జనం రారు.

బస్‌ఛార్జీలు ధర్నాలతో తగ్గుతాయనీ, నిరుద్యోగం బహిరంగ సభలతో తగ్గుతుందనీ జనం నమ్మటం లేదు. మరే విధంగా కూడా తగ్గుతాయని నమ్మటం లేదు. పార్టీల కార్యకర్తలు కూడా నమ్మటం లేదు. బహుశా పార్టీల నాయకులు కూడా నమ్మటం లేదు. ఈ హిపోక్రసీ (నటన)లోంచి పార్టీలు బయటపడకుండా జనానికి నిజమైన నాయకత్వం అందించలేవేమో ! కానీ..

'అక్షరాస్యత' జనం కోరలేదు. జనం యొక్క ఫీల్డ్‌నీడ్ కాదు, కానీ ఒక్కో జిల్లాలో లక్షల మంది చదువుకుంటామని ముందుకు వచ్చారు. వేలసంఖ్యలో యువకులు, యువతులు, చదువు చెప్పటానికి ముందుకు వచ్చారు. చదువుకోటానికి వచ్చినవారిలో ఎవరున్నారు? యస్.సి, యస్.టి., బి.సి.లవారూ, స్త్రీలూ ఎక్కువగా సెంటర్లకు వచ్చారు. సమాజంలో వెనుకబడిన వారు వీళ్ళు. తమ వెనుకబాటుతనానికి పరిష్కారం ఈ చదువులో ఉందని వాళ్ళు నమ్మారు.

నిజంగా అవసరాలైన ధరలు, ఛార్జీలు, వగైరాలతో కదలని జనం అంతగా అవసరం కాని అక్షరాస్యతతో కదిలారు. ఈ డైనమిక్స్ అర్థం చేసుకొనకుండా జనాన్ని కదల్చలేము.

## ఇంతవరకూ..

ఇంతవరకూ పై నుంచి 'ప్రజల కోసం' కార్యక్రమాలు సిద్ధం చేసి క్రిందకు దిగుమతి చేశాం. కార్యక్రమ రూపకల్పనలో 3 దశలుంటాయి. విషయసేకరణ సర్వేల ద్వారా చేస్తామీపని. ఆ విషయాన్ని క్రోడీకరించి కార్యక్రమరూపకల్పన చేస్తాము. జ్ఞాన సముపార్జనా క్రమంలోని మొదటి రెండు దశలతో పోల్చవచ్చు వీటిని. రూపొందించబడిన కార్యక్రమాన్ని అమలు చేయాలి. కార్యక్రమంలో అనుకున్నట్లుగానే ఫలితాలు వస్తే మనం చేసిన పని మొదటి రెండు దశలలో కూడా సరైందేనని భావించవచ్చు. మనంచేసిన చాలా కార్యక్రమాలు, ఎక్కడో ఎవరో ఒక నమూనాను తయారుచేశారనే పేరుతో పెద్దయెత్తున ఇక్కడ అమలు చేయ చూస్తాము. ఆ మోడల్ పెద్ద యెత్తున తిరిగి అమలు చేయడానికి పనికి వస్తుందా? లేదా? ఎవరు తేల్చాలి? ఇంతవరకు పైనున్న జనం (బ్యూరోక్రసీ, పాలకులు) చేశారు.

ఆ మోడల్‌ను జనం దగ్గర పడేసి ముందుగా చూడం. అలా చూస్తే ఒక్క క్షణంలో అర్థమవుతుంది. అది ఇక్కడ పనికి వస్తుందో లేదో జనం తేల్చుతారు. సరిగ్గా ఇక్కడే మనకున్న భేషజం (Ego) అడ్డం రాకూడదు.

అందుకే

**విషయ సేకరణ** (Survey) PRA, RRA

**కార్యక్రమ రూపకల్పన** (Consolidation & Plan)

**అమలుచేయటం** (Implimentation)

జనమే చేయాలి, జనంతో చేయించాలి.

## జనం చేయగలరా?

అని అనుమానం వస్తుంది మనకు. మన శక్తిమీద తప్ప, జనం శక్తి మీద మనకు నమ్మకం లేకపోవటమే కారణం. జనం తప్పులు చేస్తారేమోనని భయం కూడా ఉంటుంది మనకు. అంటే మనం తప్పులు చేయమా? తప్పులు చేసే కదా? ఇవన్నీ తయారుచేసింది. ఇప్పటికే మన తప్పులు చేసి పథకాల మీద కోట్లు గుమ్మరించాం కదా? ఇన్ని కోట్ల ఖరీదైన తప్పులు జనం ఇంతవరకు చెయ్యలేదు కదా ?

## జనం చెయ్యగలరు

★ శకునాల గ్రామంలోని యస్.సి. కాలనీలో గల 98 ఇళ్ళల్లో గల జనం, ఆరోగ్య సర్వే, కన్సాలిడేషన్, ఆరోగ్యప్రణాళిక రూపకల్పన అన్నీ చేశారు. (శకునాల గ్రామం ఒర్వకల్ మండలం, కర్నూలు జిల్లాలో ఉంది)

★ కర్నూలు జిల్లాలోనే గోనెగండ్ల మండలం, ఐరాన్ బండ గ్రామంలోని జనం ఆరోగ్య ప్రణాళికను అమలు చేయటం కూడా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమాలకు మనం యిచ్చిన సపోర్టు చాలా తక్కువ.

★ మద్దికెర మండలంలో 'అగ్రహారం'లో 30 సంవత్సరాల నుంచి రాజకీయ పార్టీలకు అతీతంగా రైతుసంఘం ఉంది. రైలుకట్ట అవతలకు పశువులు పోరాదని నిబంధన విధించుకున్నారు. ఎవరైనా ఉల్లంఘించితే జరిమానా కట్టాలి. ఆ జరిమానాల డబ్బు ఆ గ్రామంలో లక్షలకు పోగుబడింది.

★ చిప్పగిరి మండలం 'ఏరూరు'లో నీటిఎద్దడి ఉన్నకాలంలో నీటి రేషన్‌కార్డులు పెట్టి నీటిని సక్రమంగా పంచుకున్నారు.

★ వెల్దుర్తి మండలం 'గోవర్ధనగిరి' గ్రామంలో మామిడి కాయలు తెంచుతూ ఎవరైనా పట్టుబడితే రెండున్నర వేలు జరిమానా ఆ తోట యజమానికి చెల్లించాలి.

★ ప్యాపిల మండలం, 'యస్. రంగాపురం'లో తిప్పమీదకు పశువులు పోకుండా 'సోషల్ ఫెన్సింగ్' చేసుకున్నారు.

★ నంద్యాలలో రెవెన్యూ కాలనీలో 'చామకాలువ'కు అడ్డంగా 18 లక్షల విలువ గల్గిన సిమెంటు బ్రిడ్జిని కేవలం రాత్రిళ్లు పనిచేసి కట్టారు. జన్మభూమి కంటే చాలా ముందే ఈ కార్యక్రమం మొదలయ్యింది.

★ ఒర్వకల్లు మండలం 'తిప్పాయపల్లె'లో జనం 5 కి.మీ. రోడ్డు వేసుకున్నారు. ఇలా ఎన్నైనా చెప్పవచ్చు.

ప్లానింగులో ప్రజల పాత్ర లేకపోతే సత్ఫలితాలుండవు. గ్రామాలో మన కార్యక్రమాలకు జనం భోజనం, వసతులు ఏర్పాటుచేస్తారు. వాళ్ళ సేవనలా మనం ఇంతదాకా సరిగా వినియోగించుకోలేదు. ఉదా : చిత్తూరు జిల్లా కమ్మపల్లి మండలం, కమ్మపల్లి గ్రామంలో 120 మంది అక్షరాస్యతా కార్యకర్తలకు ప్రథమచికిత్స 2 రోజులు జరిగింది. ఒక్కో కార్యకర్త ఒక్కో ఇంటికి భోజనానికి వస్తామని చెప్పారు. మన దగ్గర భోంచేసే ఈ కుర్రాళ్ళు ఏం చేస్తారో చూద్దామని అన్నం పెట్టిన రైతులు కూడా వచ్చారు. 'పాము కరిస్తే ఏం చేయాలి?, తేలు కుడితే ఏం చేయాలి?, కరెంటు షాక్ కొడితే ఏం చేయాలి?, పురుగుమందు ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలి? ఇలా సాగుతోంది క్లాసు. అవన్నీ రైతుల సమస్యలే. కాడిమాన్లు, నాగళ్ళు అక్కడే పడేసి కూర్చున్నారు రైతులు. 120 మందిని 120 ఇళ్ళకు పంచగా ఇంకా కొన్ని ఇళ్ళు మిగిలాయి. ఆ ఇళ్ళ వాళ్ళంతా మా ఇళ్ళకు జనాన్ని ఎందుకు పంపలేదని నిర్వాహకుల మీద తగాదాకు వచ్చారు. రెండు రోజుల తర్వాత వీళ్ళంత తిరిగి వస్తుంటే జనం కన్నీళ్ళతో వీడ్కోలు ఇచ్చారు.

## చివరికేంటి ?

జనం దగ్గరకు పోయి అక్కడే కొంతకాలం ఉండాలి.

వాళ్ళు చెప్పేవన్నీ వినాలి.

వారి ద్వారానే ఏం చేయాలో వినాలి.

అప్పుడు అవసరమైతే మనం కొంత సమాచారం కలపాలి.

జనం నుంచి మనం నేర్చుకోవాలి.

అవసరమైన దాన్ని మనం అందించాలి.

జనంతో కలిసిపోవాలి.

ఎవరికీ ఇబ్బందికాని దగ్గర నుంచి కార్యక్రమాలు మొదలుపెట్టాలి. ■

# యూత్ ఫోరం

నిర్వహణ

కార్తీక్ చంద్ర

# ఉపాధి నైపుణ్యాలనిచ్చేవిగా ఐ.టి.ఐ.లను ఆధునీకరించాలి

(యువతకు ఉపాధినైపుణ్యాలనిచ్చేవిగా ఐ.టి.ఐ.లను ఆధునీకరించాలని పేర్కొంటూ యువమిత్రులు పంపిన అభిప్రాయాన్ని ప్రచురిస్తున్నాం...)

దేశవ్యాప్తంగా యువతకు ఉపాధినైపుణ్యాలను అందించటానికి పాత సాంకేతిక శిక్షణాసంస్థల్ని ఆధునీకరించటంతోపాటు కొత్తసంస్థల్ని కూడా ప్రారంభిస్తామని భారత ప్రభుత్వం 2009, అక్టోబర్‌లో ప్రకటించింది. సాంకేతిక శిక్షణాసంస్థల సంఖ్యను పెద్దఎత్తున పెంచకపోవటంతోపాటు, ఉన్న సంస్థల్లో కోర్సుల్ని ఆధునీక రించకపోవటం వల్ల దేశీయంగా, విదేశాల్లో కూడా లక్షలసంఖ్యలో ఉద్యోగావకాశాల్ని మన యువత కోల్పోతోంది. విదేశాల్లో యువత సంఖ్య తగ్గిపోతుంటే, మనదేశంలో ఆ సంఖ్య పెరగటం మనకు కలిసొచ్చే పరిణామమే అయినా, పాలకుల్లో ముందుచూపు లోపించటం వల్ల ఉపాధినైపుణ్యాలు కొరవడి ఆర్థికవ్యవస్థను దెబ్బతీస్తోంది. మన యువతలో 5శాతానికి కూడా వృత్తినైపుణ్యం లేదు. కొరియాలో 95శాతం యువతకు ఏదోక వృత్తిలో నైపుణ్యం ఉంది. ఆఖరికి బోట్స్వానాలాంటి అనామకదేశంలో కూడా 22శాతం యువతకు ఆ తరహా నైపుణ్యం ఉంది. తగినన్ని శిక్షణాసంస్థలు లేకపోవటమే అందుకు కారణం. చైనాలో దాదాపు 500,000 శిక్షణా సంస్థలుంటే మనదేశంలో అందులో దాదాపు 1.8శాతం మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా ఆ తప్పిదాన్ని దిద్దుకోవాల్సుంది.



ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇప్పుడున్న శిక్షణాసంస్థల సంఖ్యను ఎన్నో రెట్లు పెరగాల్సిన అవసరముంది. వాటిలో ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టాలి. సరైన వృత్తినైపుణ్యాలను అందించే ఏర్పాట్లు లేకపోవటంతో లక్షలాది మంది యువత అశాంతి పెరుగుతున్నా ప్రభుత్వం ఈ దిశగా సరైన చర్యలు తీసుకోలేదు. చివరికి ఈ అశాంతి స్వార్థరాజకీయ శక్తులకు ఆయుధంగా మారి యువత వారి చేతిలో పావులుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న 2009, డిసెంబర్‌కు ముందు ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఐదేళ్లలో కనీసం నైపుణ్యం ఆధారిత ఉద్యోగావకాశాలు 50లక్షలకు పైగా రానున్నాయని అంచనా వేశారు. వ్యవసాయం, వస్త్ర, టెలికాం, విద్యుత్, సహజవాయువు రంగాల్లో పెద్దఎత్తున అవకాశాలు వస్తాయని లెక్కలు వేశారు. అయితే ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర పేరుతో మొదలైన ఆందోళనల నేపథ్యంలో తలెత్తిన సంక్షోభాన్ని సరిదిద్దటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రధాన రాజకీయ పార్టీలు విఫలం కావటం వల్ల ఉద్యోగ, ఉపాధి

అవకాశాలు దెబ్బతింటున్నాయి. యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. ఇందుకోసం ఏడాదికి రూ.2500కోట్లతో వృత్తి నైపుణ్యాల శిక్షణనిచ్చి, ఏటా 10లక్షలమందికి ఉపాధి అవకాశాల్ని కల్పించాలి. మన రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా వచ్చిన ఇంజినీరింగ్ కళాశాలల్లో పట్టభద్రులైన విద్యార్థులను తీసుకోవటానికి ప్రముఖ కంపెనీలేవీ ముందుకు రావటం లేదు. అందుకే ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో సైతం ఎక్కువమంది నిరుద్యోగులుగా, చిరుద్యోగులుగా భారమైన జీవితాలు గడుపుతున్నారు. అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలకు కూడా మన రాష్ట్రంలో సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యాలు సరిపోవటం లేదని గుర్తించాలి. వస్తున్న అవకాశాలకు తగ్గట్టు కోర్సుల్ని ప్రవేశపెట్టటం, ఆధునీకరించటం వల్ల శిక్షణ పొందిన యువతకు వెంటనే ఉపాధి లభ్యమవుతుంది. ఈ దిశగా ఆధునీకరించిన ఐ.టి.ఐల ఏర్పాటు ఎంతగానో ఉపకరిస్తాయి.

గ్రామాలలో ఆర్థికవ్యవస్థను నిర్మిస్తూ చిన్నపట్టణాలను గ్రామాలతో అనుసంధానం చేస్తే ఏటా లక్షలాది ఉద్యోగాలను తీసుకురావచ్చు. ఒక్క వస్త్రసాంకేతిక పరిజ్ఞానం వల్లే రాష్ట్రంలో అదనంగా 10లక్షల ఉద్యోగాలను కల్పించవచ్చు. ప్రతి 3,500 ఎకరాలకు ఓ అగ్రిక్లినిక్‌ను ఏర్పాటుచేయటం, వ్యవసాయానుబంధ పరిశ్రమలు స్థాపించటం, విద్యుత్ వినియోగ నిర్వహణను వికేంద్రీకరించటం వంటి ఏర్పాట్ల ద్వారా మరికొన్ని లక్షలమందికి ఉపాధిని ఇవ్వొచ్చు. యువతకు ఉపాధి, శిక్షణకు భారీయెత్తున కార్యాచరణ చేపట్టకుండా చిన్నచిన్న స్కీములతో కాలక్షేపం చేస్తే మున్ముందు మరింత కల్లోల పరిణామాలు తప్పవు.

**కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ 2010-11 వార్షిక నివేదిక ప్రకారం నవంబర్, 2010 నాటికి దేశవ్యాప్తంగా ఐ.టి.ఐల సంఖ్య:**

| | ప్రభుత్వ | ప్రయివేటు |
|---|---|---|
| మొత్తం భారతదేశం | 2,189 | 6,498 |
| మహారాష్ట్ర | 389 | 316 |
| ఉత్తరప్రదేశ్ | 301 | 685 |
| మధ్యప్రదేశ్ | 173 | 85 |
| కర్ణాటక | 154 | 1,164 |
| గుజరాత్ | 153 | 371 |
| ఆంధ్రప్రదేశ్ | 134 | 508 |
| రాజస్థాన్ | 114 | 680 |
| పంజాబ్ | 95 | 182 |
| ఛత్తీస్‌గఢ్ | 90 | 46 |
| హర్యానా | 82 | 89 |
| హిమాచల్‌ప్రదేశ్ | 71 | 103 |
| తమిళనాడు | 60 | 637 |
| ఉత్తరాఖండ్ | 59 | 31 |
| పశ్చిమబెంగాల్ | 51 | 24 |
| జమ్మూ & కాశ్మీర్ | 37 | 1 |
| కేరళ | 37 | 484 |
| బీహార్ | 34 | 342 |
| అసోం | 30 | 4 |
| ఒడిశా | 26 | 562 |
| జార్ఖండ్ | 20 | 112 |
| ఢిల్లీ | 16 | 57 |
| గోవా | 10 | 4 |
| పాండిచ్చేరి | 8 | 9 |
| నాగాలాండ్ | 8 | 0 |
| త్రిపుర | 8 | 0 |
| మణిపూర్ | 7 | 0 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 5 | 0 |
| మేఘాలయ | 5 | 2 |
| సిక్కిం | 4 | 0 |
| ఛండీగఢ్ | 2 | 0 |
| దయ్యు, డామన్ | 2 | 0 |
| లక్షద్వీప్ | 1 | 0 |
| అండమాన్& నికోబార్ | 1 | 0 |
| మిజోరాం | 1 | 0 |
| దాద్రా & నాగర్‌హవేలీ | 1 | 0 |

**(దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఐ.టి.ఐలలో 4,52,162 సీట్లు ఉండగా, ప్రైవేటులో 7,54,286 సీట్లు ఉన్నాయి)** ■

# జన జీవనం నుండి.... శాసనమండలికి...

ఏ. అన్నపూర్ణ



అంగూరి లక్ష్మీ శివకుమారి
ఎమ్.ఎల్.సి

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఒక మార్గం. ముఖ్యంగా మహిళలు ఉద్యమాలు చేపడితే విజయం లభిస్తుందనడానికి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వుంది. అందుకే స్వయం సహాయక సంఘానికి చెందిన ఒక మహిళకు ప్రాతినిధ్యం కలిగించాలనే ఆలోచనతో శాసన మండలి సభ్యురాలిగా గవర్నర్ కోటా నుంచి పొదుపు ఉద్యమంలో పనిచేసిన ఒక సాధారణ మహిళను ఎంపిక చేయడం సముచితంగా భావించవచ్చు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అంగూరి లక్ష్మీ శివకుమారికి ఈ అవకాశం లభించింది. శివకుమారి 2009 వరకూ జిల్లా మహిళా సమాఖ్యకి అధ్యక్షురాలిగా వున్నారు.

**మహిళావేదిక**

తూర్పు గోదావరి జిల్లా రౌతులపూడి మండలం ఎ.మల్లవరం ఒక మారుమూలగా వుండే గ్రామం. ఆ గ్రామంలో పేద దళిత కుటుంబంలోని వ్యక్తి లక్ష్మీశివకుమారి. తండ్రి గ్రామ నౌకరుగా పనిచేస్తూ మద్యానికి బానిసై తల్లిని వేధిస్తూ గంజినీళ్ళు కూడా లేని పరిస్థితిలో చదువుపట్ల శ్రద్ధాసక్తులు వున్నా, కలసిరాని స్థితి ఆమె కుటంబమేకాదు. అందరిదీ ఇదే జీవితం. సాహస వంతురాలు అయిన లక్ష్మీ మద్యం మాన్పించడానికి నడుంకట్టింది. పెద్దలందరినీ కలిసి మద్యం వలన జరిగే అనర్థాలను దుష్ఫలితాలను వివరించింది. ఆమె ప్రయత్నం ఫలించింది. అంతా కలసి ఆ గ్రామంలో మద్యం అమ్మడం, కొనడం జరగరాదని తీర్మానించారు. ఈ విషయంలో వ్యతిరేకించిన వారు తక్కువే కావడం, ఆమె ఆశయం ఫలించింది. మద్దత్తు లభించింది. దాంతో వ్యసనాలు దూరమై వారి జీవితాలు బాగుపడ్డాయి. పిల్లల చదువు, వారి భవిష్యత్ పట్ల ఆశలు ఏర్పడ్డాయి. అందరూ చొరవ చూపించి నాయకత్వం వహిస్తే ఏ సమస్యలైనా ఎదుర్కొవచ్చంటూ లక్ష్మీ ధైర్యం చెప్పారు.

ఉపాధి, పొదుపు, చదువు వంటి అంశాలలో మహిళలను ప్రోత్సహించి చైతన్యం తీసుకువచ్చారు. పన్నెండు మంది సభ్యులతో 'జ్యోతి' పొదుపు సంఘాన్ని ప్రారంభించింది. ఒక్కొ సభ్యురాలు పదిరూపాయల వంతు చెల్లించే విధంగా వీలైనంత మందికి పొదుపు గురించిన అవగాహన కల్పించారు. దాచుకున్న సొమ్మును విద్య, ఉపాధి, అత్యవసర సమయంలో వాడుకోవడానికి వీలుకలిగే ఆలోచనను అమలు చేశారు. ఆరోతరగతి మాత్రమే చదివినా లక్ష్మీకి సహజ సిద్ధంగా మాట్లాడే అలవాటు వుంది. ధైర్యంగా మాట్లాడటం తాను తెలుసుకున్న విషయాలను అనుభవాలను చక్కగా వివరించడం వంటి నైపుణ్యం అలవడింది. పదహారేళ్ళపాటు ఆమె సాగించిన ప్రస్థానంలో గ్రామస్థాయికే పరిమితం కాకుండా రాష్ట్రస్థాయి పొదుపు సదస్సులు సమావేశాల్లోనూ పాల్గొని మహిళలకు ఒక మార్గం చూపించారు. ఇందిరా క్రాంతి పథకం సీనియర్ సిఆర్‌పిగా సేవలు అందిస్తున్నారు. గ్రామ సర్పంచ్‌గా పనిచేయడానికి అవకాశం కలిసివచ్చినా సేవ చేయడానికే మొగ్గుచూపి ముందుకు అడుగువేశారు. అందుకు ప్రతిఫలంగా ఇప్పుడు ఎమ్ఎల్సీ (మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ కౌన్సిల్) పదవి ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

గ్రామీణ మహిళలకు అనేక సమస్యలున్నాయి. పౌష్టికాహారలోపం, ప్రాథమిక ఆరోగ్య వసతులు లేకపోవడం వీటి మీదనే దృష్టి వుంచాల్సిన అవసరం ఎంతైనావుంది. ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా సమాఖ్యల సమావేశాలు నిర్వహించడం వలన ఎవరికి ఏ సమస్యలున్నాయో తెలుసుకో గల అవకాశం లభించింది.

పదవి లభించిన ఆనందంతో బాటు, బాధ్యత తన మీద వుందనే కర్తవ్యం తనను ముందుకు నడిపిస్తుంది. అంటూ ఆత్మవిశ్వాసం తొణికిసలాడే లక్ష్మీ ఎందరికో ఆదర్శం అనడం అతిశయోక్తి కాదు. ■

# వ్యవసాయోత్పత్తుల స్వేచ్ఛావాణిజ్యానికి ఆహారభద్రతా చట్టం ఆటంకం కాదు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఆహారభద్రతా చట్టాన్ని అమలు చేయాలని ప్రతిపాదిస్తుండటం వల్ల వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు సాధ్యం కాదని కొంతమంది చేస్తున్న వాదన అర్థరహితం. ఈ సంవత్సరం బియ్యం, గోధుమలు, చిరు ధాన్యాలు కలిపి (పప్పుదినుసులు, జంతువుల దాణా కోసం ఉపయోగించే మొక్కజన్న వగైరాలను మినహాయించి) ఆహారధాన్యాల ఉత్పత్తి 20.2 కోట్ల టన్నులు ఉంటుందని అంచనా అని, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులతో సహా దేశ జనాభా మొత్తానికీ నెలకి తలసరి 9 కిలో ఆహార ధాన్యాల వినియోగంగా లెక్కిస్తే ఏడాదికి 13కోట్ల టన్నుల బియ్యం లేదా గోధుమలు లేదా చిరుధాన్యాలు అవసరమని, అంటే ఏడాదికి 7 కోట్ల టన్నులు మిగులుతాయి. కేవలం బియ్యం, గోధుమలు 18 కోట్ల టన్నులు ఉత్పత్తికాగా, కనీసం 5 కోట్ల టన్నుల మిగులు తేలుతోంది. "వాస్తవానికి కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ ఆహారభద్రతా చట్టం కింద 46శాతం జనాభాకి కుటుంబానికి నెలకి 35 కిలోల చొప్పున, మరో 26శాతం జనాభాకి కుటుంబానికి నెలకి 20 కిలోల చొప్పున ఆహారధాన్యాల్ని పంపిణీ చేస్తే అవసరమయ్యేది 7 కోట్ల టన్నులు. ఈ ఏడు కోట్ల టన్నుల ఆహారం దేశ ప్రజల ఆహార అవసరాలకి కావలసిన 13 కోట్ల టన్నుల్లో భాగమే. ప్రస్తుతం ఎఫ్.సి.ఐ అధీనంలో ఉన్న గోడౌన్లలో 7కోట్ల టన్నుల మేర బియ్యం, గోధుమలు ఇప్పటికే నిల్వ ఉన్నాయి. ఈ రబీలో మరో 2కోట్ల టన్నుల దాకా అదనంగా సేకరించవచ్చు. అంటే 9 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు నిల్వ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. ఇది బహుశా దేశచరిత్రలోనే రికార్డు. కాబట్టి ఏ విధంగా చూసినా 5 నుంచి 7 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఈ సంవత్సరంలోనే అవసరానికి మించి మనదేశంలో మిగులు కనిపిస్తోంది. వాటికి విదేశాల్లో మార్కెట్‌ని కల్పించకపోతే ఆ ఆహారధాన్యాలు ఎలుకలు, పందికొక్కుల పాలుకావటం, కుళ్లిపోవటం, విదేశీ మారక ద్రవ్యం కోల్పోవటం, మరోవైపు రైతులకి మార్కెట్‌లో ఏమాత్రం రేటు రాకుండా సంక్షోభానికి దారితీయటం ఖాయం". ఇది ఇంతటితో తీరిపోయే సమస్య కాదు, ఓ వైపు ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతుండగా, మరోవైపు వాటి తలసరి వినియోగం తగ్గుతున్నది. చాలామంది వినియోగదారులు క్రమక్రమంగా ఆహారధాన్యాల స్థానంలో పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసాహారం వినియోగాన్ని పెంచుతున్నారు. "అందువల్ల ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థకు కావలసినంత మేరకు రైతులకు లాభసాటి ధర ఇచ్చి ఎంత మేరకైనా సేకరించి నిల్వ చేసుకుని, ఆ పై మిగులు ఆహారధాన్యాల్ని విదేశాలకు ప్రభుత్వ సంస్థల ద్వారానే ఎగుమతి చేసి లాభాలను రైతులకు బోనస్‌గా ఇవ్వాలి. కేంద్రప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని గుర్తించి వెంటనే ఆహారధాన్యాల విదేశీవాణిజ్యానికి అనుమతించాలి. ■

**రైతు వేదిక**

## బియ్యం ఎగుమతిని ప్రభుత్వమే చెయ్యాలి లాభాల్ని రైతులకు పంచాలి

బాస్మతీయేతర బియ్యం ఎగుమతులకు అనుమతినిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవటాన్ని లోక్‌సత్తా పార్టీ స్వాగతించింది. అయితే కేవలం 10లక్షల టన్నుల్ని, అది కూడా రైతులు ఎక్కువశాతం ధాన్యం అమ్ముకున్న తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకోవటం వల్ల బడా వ్యాపారులకే లాభమని లోక్‌సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ, కార్యదర్శి పి. భాస్కరరావు మంగళవారం విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాలను కొంతమేరైనా పరిరక్షించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ఎగుమతులను ఎఫ్.సి.ఐ, ఎస్.టి.సి, ఎం.ఎం.టి.సి, పి.ఇ.సి తదితర ప్రభుత్వ సంస్థల ద్వారానే చేయించి వచ్చిన లాభాల్ని రైతులకు బోనస్, తదితర రూపాల్లో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రైవేటు వ్యాపారుల చేతే ఎగుమతులు చేయిస్తే విధిగా సుంకం విధించి ఆ డబ్బును రైతులకు పంచాలన్నారు.

# స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య

## గ్రామ రైతు వేదికల ఏర్పాటుకు మార్గదర్శకాలు

రాష్ట్రంలో వ్యవసాయ రంగం పెనుసంక్షోభంలో ఉంది. రైతు సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, పెరగని మద్దతు ధరలు, రైతు వ్యతిరేక ఎగుమతి, దిగుమతి విధానాలు, బరువుగా మారిన రుణం, ఇన్సూరెన్సు మరియు ఇతర సేవలు, విపత్తుల సమయంలో ఆదుకోలేని ప్రభుత్వ విధానాలు అన్నీ కలిపి రైతులను క్రుంగదీస్తున్నాయి. శ్రీ స్వామినాధన్ కమిషన్ రైతు సమస్యల పరిష్కారానికి 2006లోనే నివేదిక సమర్పించనప్పటికీ కేంద్రప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు. ప్రధానమంత్రి నియమించిన ముఖ్యమంత్రుల వర్కింగ్ గ్రూప్ సిఫార్సులు కూడా నిర్లక్ష్యానికి గురైయ్యాయి. వర్కింగ్ గ్రూప్, స్వామినాధన్ కమిషన్‌లు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుపై 50శాతం అదనంగా కలిపి ధరను నిర్ణయించాలని సిఫార్సు చేశారు. ఆర్భాటంగా నియమించిన జయతిఘోష్ కమిషన్ ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా మద్దతు ధర ఇచ్చి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని చెప్పింది. మార్కెట్ స్టెబిలైజేషన్ నిధిని పెట్టాలని చెప్పింది. రామచెన్నారెడ్డి కమిషన్ కూడా రైతుల ఆత్మహత్యలు తగ్గాలంటే పైన పేర్కొనబడిన సిఫార్సులను అమలు చేయాలని పేర్కొంది. ముఖ్యమంత్రుల వర్కింగ్ గ్రూప్ వ్యవసాయదారులకు వ్యవసాయ రుణాలను నాలుగుశాతం వడ్డీకి ఇవ్వాలని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులపై సుమారు 11శాతం వరకు టాక్స్ విధిస్తున్నారు. రాష్ట్ర ఖజానాకు కేవలం ధాన్యం, పంటమీదనే ప్రభుత్వానికి ఏటా 1500 కోట్లు ఆదాయం లభిస్తుంది.

పైన పేర్కొనబడిన అంశాలను పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు రైతులు, కౌలురైతులు అనేక కష్ట, నష్టాలకు గురౌతూ పంటలు పండించి, దేశంలోనే అన్ని వర్గాల ప్రజలకు ఆహారాన్ని అందించే పనిముట్లుగా గుర్తించారు తప్ప, వారు పంటలు పండించకపోతే రాబోయే కష్టాలు కానీ, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతన్నల పరిస్థితి కానీ, ఆత్మహత్యల గురించి కానీ పట్టించుకున్న ప్రభుత్వాలు లేవు. దానికి కారణం రైతులు, కౌలురైతులు పంటల వారీగా, కులాల వారీగా, పార్టీల వారీగా, ప్రాంతాల వారీగా విడిపోయి ప్రభుత్వాల చేతిలో మరబమ్మలుగా మారడమే.

రైతులు, కౌలురైతులు సామాజికంగా, ఆర్థికంగా, గౌరవపదంగా జీవించాలంటే తమకు తాముగా గుర్తించవలసిన అంశం తాము సంఘటితం కావడమే.

పంటలకు, పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా రైతులు, కౌలురైతులను సంఘటితం చేయడం కోసం స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య నాయకత్వం గత సంవత్సరం సెప్టెంబర్ నుండి మే 2011 వరకు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి రైతులతో ముఖాముఖీ సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను అధ్యయనం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకీ, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రస్థాయిలో స్వతంత్రరైతు సంఘాల సమాఖ్య ఏర్పాటు చేసి అన్ని పార్టీలతో, అన్ని రైతు సంఘాలతో రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించి రైతులకు కొన్ని విజయాలు సాధించడం జరిగింది.

రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య ప్రధాన నినాదం రైతులు పండించే పంటకు లాభసాటి ధరసాధించడం. రైతులు తాము పండించిన పంటను స్వేచ్ఛగా ఎక్కడైన అమ్ముకోవడం.

పార్టీలకు, ప్రాంతాలకు, పంటలకు, అతీతంగా రైతులను

**స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్యను** Federation of Independant Farmers Association FIFA) **రిజిష్టర్ చెయ్యడం జరిగింది. రిజిస్ట్రేషన్ నెం: 341/2011 ఈ సమాఖ్యలో గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సంఘాలు, సంస్థలు చేరడగానికి వీలు వుంది. గ్రామస్థాయిలో కొత్తగా ఏర్పాటు చేసుకునే సంఘాలు ఇక్కడ సూచించిన విధంగా "రైతువేదికలను" ఏర్పాటు చేసుకోవాలి. ఇంతకు ముందే ఏర్పడిన సంఘాలు నేరుగా ఈ సమాఖ్యలో సభ్యత్వం పొందవచ్చును.**

– పి. భాస్కరరావు సెల్ : **98485 17283**

స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి

# రైతు వేదిక

## గ్రామం.... మండలం.... జిల్లా

### రైతు వేదిక లక్ష్యాలు

1. పంటలు వేరైనా రైతులంతా ఒక్కటే. పంటల వారీగా ఒంటరిగా పోరాడుతున్న రైతులందరికీ తోడ్పాటు అందించటం. స్థానికంగా రాజకీయాలకు అతీతంగా రైతుల్ని ఐక్యపరిచే వేదికగా ఉంటుంది. స్థానిక వ్యవసాయపరమైన సమస్యలపై రైతులకు తోడ్పాటునిచ్చే వేదికగా వుంటుంది.
2. వ్యవసాయాన్ని లాభసాటి చేసుకునే విధానాల కోసం రైతులను సంఘటిత పర్చడం.
3. వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి మద్దతు ధర సాధించడానికి కృషి చేయడం.
4. రైతులు తమ ఉత్పత్తులను లాభసాటిగా ఎక్కడైన అమ్ముకోవడం కోసం ఉద్యమించడానికి కృషిచేయడం.
5. రైతులకు వ్యవసాయపరమైన శాస్త్రీయ సమాచారాన్ని అందించటానికి, విధానపరమైన మార్పుల మీద అవగాహన పెంపొందించటానికి వేదికగా వుంటుంది.
6. రైతుల హక్కులకు భంగం లేకుండా కౌలురైతుల ప్రయోజనాలను కల్పించడం.
7. రైతులకు సులభంగా బ్యాంకుల నుండి రుణాలు పొందే ఏర్పాటు కోసం
8. రైతులు తాము పండించిన పంటలను లాభసాటిగా అమ్ముకోడానికి కావలసిన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం
9.. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వ్యవసాయానికి ప్రభుత్వపరంగా వచ్చే సబ్సిడీలు రైతులకు సక్రమంగా అందించే ఏర్పాటు.
10. గ్రామీణులు మరియు రైతులు ఆర్థికంగా, సాంఘికంగా ఎదగటానికి తోడ్పాటు, రైతులు గౌరవప్రదమైన జీవనానికి కావలసిన ఏర్పాటు.
11. పట్టణాలలోని వసతులు, ఉద్యోగ అవకాశాలు గ్రామీణ ప్రాంతాలలో కల్పించటం.
12. రైతులు పండించిన పంటలకు విలువలను పెంచే వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పడటం.

### నియమ నిబంధనలు

**1.సంఘం పేరు :**

రైతు వేదిక ..........................................................

గ్రామం :..............................మండలం......................

**2. సంఘం చిరునామా :**

.......................................................................

.....................................................................

**3. సభ్యత్వం :** రైతు కానీ, కౌలురైతు కానీ రైతువేదిక ఆశయాలను అమోదించిన వారికి సభ్యత్వం లభించును.

**4. సభ్యత్వ రుసుము :** రైతు కానీ, కౌలు రైతుకానీ సభ్యత్వ రుసుము రూ॥20 రెండుసంవత్సరాలకు జనరల్‌బాడీ : రైతు వేదికలో సభ్యత్వ రుసుము చెల్లించిన రైతులు, కౌలురైతులు సభ్యులుగా నమోదుకాగలరు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మాసంలో జరుగు జనరల్‌బాడీ సమావేశమునకు హాజరుకాగలరు.

**విధులు, బాధ్యతలు :**

1. సంవత్సర కాలనికి సంబంధించిన ఆదాయ, వ్యయముల అమోదము.

2. కార్యవర్గాన్ని ప్రతి రెండుసంవత్సరములకు ఒకమారు ఎన్నుకొనుట.

3. సంవత్సర కాలంలో రైతువేదిక నిర్వహించిన కార్యకలాపాల వివరణ మరియు అమోదం.

**ఎగ్జిక్యూటివ్ కమిటీ :**

1. అధ్యక్షులు, 2. ఉపాధ్యక్షులు, 3. కార్యదర్శి, 4. కోశాధికారి, 5. ముగ్గురు కార్యవర్గ సభ్యులు.

**సర్టిఫికేట్ :** 1. రైతువేదిక లాభలకోసం లేదా వ్యాపారాలు నిర్వహించడానికి ఏర్పాటు చేయబడలేదు.

2. రైతు వేదిక నుండి సభ్యులకు గానీ కార్యవర్గ సభ్యులకుగానీ ఎటువంటి వేతనము చెల్లించబడదు.

3. రైతు వేదిక వారి సమస్యలను చట్టబద్ధంగా, సమరస్యంగా, శాంతియుతంగా పరిష్కరించుకుంటుంది.

4. రైతు వేదిక కార్యనిర్వాహకుల సంతకాలు నిజమైనవి.

**కార్యనిర్వాహక వర్గం :**

1. అధ్యక్షులు:....................................

2. ఉపాధ్యక్షులు :.....................................

3. కార్యదర్శి :.....................................

4. కోశాధికారి :.....................................

5. కార్యవర్గసభ్యులు :.....................................

6. కార్యవర్గసభ్యులు :.....................................

7. కార్యవర్గసభ్యులు :.....................................

**సాక్షులు :**

1..............................

2..............................

## ఎగ్జిక్యూటివ్ కమిటీ విధులు

**1. అధ్యక్షులు :**ప్రతి సమావేశానికి అధ్యక్షత వహించడం, నిర్వహించడం. ఓటింగ్ జరిగినపుడు సమానంగా ఓట్లు వస్తే ఓటింగ్‌లో పాల్గొనడం.

**2. ఉపాధ్యక్షులు :** అధ్యక్షుడు సమావేశంలో పాల్గననపుడు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించడం, సహాయపడటం.

**3. కార్యదర్శి :** రైతు వేదిక కార్యకలాపాలు నిర్వహించడం, రికార్డుల నిర్వహణ, సమావేశాల మినిట్స్ వ్రాయడం.

**4. కోశాధికారి :** డబ్బుకు సంబంధించిన లావాదేవిలు, ఎకౌంట్లు నిర్వహించడం.

**5. కార్యవర్గ సభ్యులు :** రైతు వేదిక కార్యవర్గ సమావేశానికి హాజరు అవడం, చర్చలలో పాల్గొనడం, తీర్మానాలు రూపొందించడం, బాధ్యతలు పంచుకోవడం.

**6. కోరం:** మొత్తం సభ్యులలో 20% మంది

**7. బైలామార్పులు :** హాజరైన సభ్యులలో 2/3 వంతు సభ్యులతో అమోదం పొందడం.

**8. సంఘం రద్దు:** అనివార్యపరిస్థితులలో రైతు వేదికను రద్దుపరుచుకోవాలంటే ఆస్తులను, అప్పులను ఇదే తరహాలో ఉన్న సంఘానికి అప్పగించడం. ■

---

సంఘటిత పరచడం కోసం, గ్రామస్థాయిలో రైతు వేదికలను (రైతుసంఘం) ఏర్పాటు చేసుకొని తాము పండించిన పంటలకు లాభసాటి ధరలను సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి.

ఈ సందర్భంగా మనం గుర్తించవలసిన అంశం సంఘటితంగా ఐక్య ఉద్యమాల ద్వారా, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రారిశ్రామిక రంగంలోని కార్మికులు, సేవారంగంలో ఉన్న బ్యాంక్ ఉద్యోగులు అటోరిక్షా కార్మికులు, లాయర్లు, డాక్టర్లు తాము చేస్తున్న వృత్తి సమస్యల మీద ఏవిధంగా పోరాటం చేస్తున్నారో అదే విధంగా రైతన్నలు కూడా సంఘటితంగా పోరాడితే సాధించలేనిదంటూ ఉండదు. దేశంలో అత్యున్నత పదవులలో ఉన్న ఐ.ఎ.యస్,ఐ.పి.యస్. అధికారులు కూడా, సంఘాలని నిర్మించుకొని తమకు అన్యాయం జరిగినప్పుడు సంఘటితంగా పోరాడుతున్న విషయం మనకు తెలిసిందే.

"రైతున్నలు సంఘటితం కావడమే మార్గం - తాము పండించిన పంటలకు లాభసాటి ధరలు పొందడమే లక్ష్యం"గా వెంటనే ప్రతి గ్రామంలో రైతు వేదికలు (రైతు సంఘం) ఏర్పాటు చేసుకొనవలసినదిగా కోరుతున్నాము. గ్రామంలో రైతు వేదికను (సంఘం) ఏర్పాటు కోసం కావలసిన "నమూనా బైలా" ను జతచేయుచున్నాము. నమూనా బైలాను తమ అవసరాలకు తగిన విధంగా మార్చుకొనే అవకాశం కల్పించడమైనది.

ఆసక్తి కలిగిన రైతులందరూ సమావేశమై రైతు వేదికను(సంఘం) ఏర్పాటు చేసుకొని తీర్మానం చేసుకోవాలి. మరొక తీర్మానంలో రాష్ట్రస్థాయిలో జేపీగారి నాయకత్వంలో ఏర్పాటు చేయబడిన స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య - హైదరాబాద్. (ఫెడరేషన్ ఆఫ్ ఇండిపెండెట్ ఫార్మర్స్ అసోసియేషన్) వారికి అనుబంధం చేసుకోవడానికి తీర్మానం చేసి, అధ్యక్షులు స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య వారికి తీర్మానం కాపీని మరియు రూ॥200(రెండువందలు) (ఎఫ్.ఐ.ఎఫ్.ఎ) పేరుమీద చెక్కుకానీ, డ్రాఫ్టుకానీ పంపగలరు.

గ్రామస్థాయి రైతు వేదిక (సంఘం) అభ్యర్థనను స్వతంత్రరైతు సంఘాల సమాఖ్య - హైదరాబాద్ వారు పరిగణలోకి తీసుకొని రెండుసంవత్సరాల కాలనికి సభ్యత్వం మంజూరు చేస్తు గుర్తింపుగా ఒక (సర్టిఫికేట్) ధృవీకరణ పత్రము రైతు వేదిక పేరుపై పంపడం జరుగుతుంది.

గుర్తింపు పొందిన రైతువేదికకు రాష్ట్ర కార్యాలయం నుండి రైతు ఉద్యమాలు నిర్వహించడానికి కావాలసిన సలహాలు, సూచనలు, రైతుల శిక్షణ కొరకు ఏర్పాట్లు, రైతులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు మొదలైనవి పంపబడును. ■

# మహిళలు రాజకీయాల్లో రాణించాలి

## నరసరావుపేట

పురపాలక సంఘాలు, పంచాయితీల వంటి స్థానిక సంస్థలకు రాజ్యాంగం ప్రకారం నిధులు, విధులు బదలాయించాలని, పరిపాలనలో అవినీతిని నిర్మూలించాలని లోక్‌సత్తా పార్టీ, మహిళాసత్తా, పోరాడుతున్నా ఫలితం లేదని మహిళా సత్తా రాష్ట్ర అధ్యక్షురాలు నందూరి సరోజాదేవి అన్నారు. స్థానిక పాతూరు చౌడేశ్వరి అమ్మవారి గుడి వద్ద నిర్వహించిన 26వ వార్డు మహిళాసత్తా సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ మహిళా సత్తా నాయకురాలు గంటా నిర్మలాబోస్ అధ్యక్షత వహించారు. మున్సిపల్ పరిధిలో కనీస సౌకర్యాలైన మంచినీరు, పరిశుభ్రత, వీధిలైట్లు, రోడ్లు తదితర సమస్యల పరిష్కారానికై మహిళలు కలసికట్టుగా పోరాడాలని అందుకు మహిళాసత్తా అండగా ఉంటుందన్నారు. జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు కె.లలిత కుమారి మాట్లాడుతూ నీతివంతమైన రాజకీయాలకై కృషి చేస్తున్న లోక్‌సత్తాను అభిమానించాలని కోరారు. కమిటీ ఎన్నిక – 26వ వార్డు మహిళా సత్తా అధ్యక్షురాలుగా నలమాల పార్వతి, ఉపాధ్యక్షురాలుగా బొందిలి కమలాబాయి, కార్యదర్శిగా పాత సీతారావమ్మ, సహాయకార్యదర్శిగా బొందిలి శివనాగేంద్రం, కోశాధికారిగా ఇమ్మడిశెట్టి విజయతో పాటు మరో ఆరుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# కాకినాడలో ఓటరు నమోదు కేంద్రాలు

**లోక్‌సత్తా ఉద్యమ వార్తలు**

రైతాంగ సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు విమర్శించారు. మొన్నటి వరకు పండిన ధాన్యం కొనుగోలు చేయలేని అసమర్థ ప్రభుత్వాలు నేడు రైతుకు విత్తనం, ఎరువులు అందించటంలో మీనమేషాలు లెక్కిస్తుందని ఆయన అన్నారు.

ఆయన కాకినాడలోని అశోకనగర్ లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు, మరియు ఓటరు నమోదు సహాయక కేంద్రాన్ని ప్రారంభించారు. కౌలు రైతులకు మేలు చేసేలా లైసెన్సు కల్పివేటరు చట్టాన్ని తేవడాన్ని ఆయన ప్రశంసించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ ఆలూరి విజయలక్ష్మి రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు, పి.సుబ్రహ్మణ్యం, నెక్కంటి శ్రీనివాస్, వాకాడ సుబ్బారావు, ఎమ్.శివరామకృష్ణ, రాజేష్ వర్మ మొదలైన వారు పాల్గొన్నారు.

### ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమే లోక్‌సత్తా పార్టీ

ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా పార్టీ పనిచేయాలని, లోక్‌సత్తా పార్టీ పట్ల సదభిప్రాయం ఉన్నవారు సమాజంలో చాలా మంది ఉన్నవారిని లోక్‌సత్తా పార్టీలో చేర్చుకోవటానికి కృషి చేయాలని, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు అన్నారు. 49వ డివిజన్‌లో ఓటరు సహాయక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు వై.డి.రామారావు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి పాలడుగు సుబ్రహ్మణ్యం, నెక్కంటి శ్రీనివాస్, వాకాడ సుబ్బారావు, రాజేష్‌వర్మ, అడపాశంకర్, కిషోర్‌కుమార్, పునీల్ శివరామకృష్ణ, భీమశంకరం, ప్రసాద్ మొదలగునవారు పాల్గొన్నారు.

## గుంటూరు

### ప్రజలను ప్రభువులను చేసే నాయకులు రావాలి

మున్సిపల్ ఎన్నికలు గడువులోపుగా జరపకపోగా, ఇంకా వాయిదాకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆయన మండిపడ్డారు. 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికే ఇది విఘాతం కలిగిస్తుందని, వెంటనే మున్సిపల్ ఎన్నికలను జరిపించాలని బండారు రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పట్టణ ప్రజలకు సరైన నివాసయోగ్యమైన పరిసరాలు సృష్టించడంలో ప్రభుత్వం విఫలమైందని, పైగా తగుదునమ్మా అంటూ ఆస్తిపన్ను పెంచడానికి సిద్ధపడితే పన్నులకు తగ్గ సేవలు అందించని ప్రభుత్వానికి పన్నులు చెల్లించవలసిన అవసరం లేదని జిల్లా అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి అన్నారు.

# కూకట్‌పల్లిలో ఉపాధి శిక్షణా కార్యక్రమాలు

జూట్, కాగితపు బ్యాగుల తయారీలో శిక్షణతో మహిళలు ఉపాధి పొందాలని లోక్‌సత్తా నాయకులు బొంతు సాంబిరెడ్డి అన్నారు. కూకట్‌పల్లిలో మహిళలకు జూట్ బ్యాగ్‌లను, నాన్‌ఓవెన్ బ్యాంగ్‌ల ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జయప్రకాష్‌నారాయణ్ సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ శిక్షణ నెల రోజులు ఉంటుందని, 32 మందికి మాత్రమే శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతేకాక ఎవరైనా 30 మంది గ్రూపుగా వస్తే వారి ప్రాంతంలో ఉచిత శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు ఓంశంకర్, భవానీ, జీవన్‌లత, క్రిష్ణారావు, కేశవరెడ్డి, వార్డు కమిటీ మెంబర్స్ స్వరూప్‌గౌడ్, ఉమారాణి పాల్గొన్నారు.

### సీనియర్ సిటిజన్స్‌కు కంప్యూటర్ శిక్షణ

కూకట్‌పల్లిలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కొరకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు 70 మంది దరఖాస్తు చేసుకున్నారు. శిక్షణ నెల రోజులు ఉంటుందని దీనిలో కంప్యూటర్ బేసిక్, ఇంటర్‌నెట్‌లకు సంబంధించిన శిక్షణ ఇస్తున్నామన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో రిలైన్స్‌లో ఉద్యోగాల కొరకు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూకు 66 మంది హాజరుకాగా 28 మందిని ఎంపిక చేసినట్లు లోక్‌సత్తా నేత బొంతు సాంబిరెడ్డి గారు ఒక ప్రకటనలో తెలిపారు.

### షాపింగ్ మాల్స్ కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరు

**కేపీహెచ్‌బీకాలనీ :** వ్యాపార వాణిజ్య సముదాయాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యం కావాలని రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ పి.వి.సుబ్బారావు పిలుపునిచ్చారు. వాణిజ్య సముదాయాల్లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం నుంచి మ్యారేజ్ లైఫ్ స్కీమ్ ద్వారా రూ॥10 వేలు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ ద్వారా రూ॥20వేలు, వారి పిల్లలకు ఏడవ తరగతి చదివితే రూ॥500, పదవ తరగతి చదివితే రూ॥1000 సహజ మరణానికి రూ॥5000 ఇచ్చే పథకాలు ఉన్నాయని వీటిని ఉపయోగించుకుంటున్న వారు తక్కువగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, శేషగిరిరావు, ఓంశంకర్, పవన్‌కిషోర్‌రెడ్డి, లక్ష్మీసరస్వతి పాల్గొన్నారు.

## చిలకలూరిపేట

# విద్యుత్ కార్యాలయం వద్ద ప్రజల నిరసన

### విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన

**చిలకలూరి పేట :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. జూన్ 28వ తేదీన సుబ్బయ్యతోటలోని కంచర్ల సాంబశివరావు ఆస్పత్రి ప్రాంతంలో హై వోల్టేజీతో ఇళ్లలోని టీవీలు, ఫ్యానులు, ఏయిర్‌కూలర్లు కాలిపోయాయని వాటికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదాను భానుప్రసాద్ మాట్లాడుతూ గృహోపకరణాలు నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, విద్యుత్ సబ్ ఇంజనీర్ మాధవికు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ సబ్బార్, మురికిపూడి ప్రసాద్, నున్నా అశోక్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, అంజనేయులు పాల్గొన్నారు.

**లోక్‌సత్తా ఉద్యమ వార్తలు**

### లోక్‌సత్తా సేవలు మరింత విస్తృతం

**చిలకలూరి పేట :** యుకెలో పిపుల్స్ ఫర్ లోక్‌సత్తా పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులోభాగంగా అమెరికా, అనేక దేశాలలో ఉన్న ప్రవాస భారతీయులు భారత దేశంలోని అవినీతికి వ్యతిరేకంగా దండిమార్చ్ నిర్వహించటం జరిగిందని పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. యుకె నుంచి వచ్చిన ఆయన స్థానిక లోక్‌సత్తా కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట శాఖ కార్యక్రమాలు మరింత విస్తృత పర్చేందుకు ఎలాంటి సహాయం కావాలన్నా తాను సహకరిస్తానని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భాను ప్రసాద్, పట్టణ అధ్యక్షులు జబ్బార్, ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్, సాదిక్, రజాక్, సిద్ధిక్, కామినేని అంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో ప్రజా కార్యకలాపాలు

**లోక్‌సత్తా ఉద్యమ వార్తలు**

### ప్రత్యక్ష పద్ధతి ద్వారా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలి

**విజయనగరం :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష పద్ధతి ద్వారా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని లోక్‌సత్తా పార్టీ యువసత్తా ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ చర్చా కార్యక్రమంలో సిపిఎం రైతుసంఘం నాయకులు మర్రావు సూర్యనారాయణ మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో జరిపించాలని కోరారు. విశ్రాంత కాలేజీ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త కురిమినేని అప్పలనాయుడు మాట్లాడుతూ పరోక్ష ఎన్నికల్లో డబ్బున్న వాడిదే రాజ్యాంగా మారుతోందని అన్నారు. కార్యక్రమం లో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, బొంగ భానుమూర్తి ఐఎస్‌టియు సన్యాసిరావు. లోక్‌సత్తా నాయకురాలు అనంతలక్ష్మీ తిప్పాన కోటేశ్వరరావు, సుభద్రాదేవి, బాలజీ, యాగాటి వెంకటరమణ, బి. వీరభద్రరావు, పి. నారాయణ రావు మాట్లాడారు. కార్యక్రమంలో యువసత్తా అధ్యక్ష కార్యదర్శులు పాండ్రింకి వెంకటరమణ. కె. దయానంద్ పాల్గొన్నారు.

### సివిల్స్ ర్యాంకర్ అజయ్‌కి సన్మానం

**విజయనగరం :** లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో సివిల్స్ ర్యాంకర్ అజయ్ జైన్‌కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న అవినీతి రాజకీయాలను యువత వ్యతిరేకించాలన్నారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ అవినీతికి వ్యతిరేకంగా పాలన సంస్కరణలు తేవడానికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా శివరామారావు తదితరులు ఉన్నారు.

### పెరిగిన ధరల భారాన్ని ప్రభుత్వం భరించాలి

**విజయనగరం :** పెరిగిన వంటగ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరల భారాన్ని ప్రజలపై మోపకుండా రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాలని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశెట్టిబాబ్జీ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో పార్టీ ప్రతినిధులు రాయి పద్మావతి. కెకెఎం. రాజు, పాండ్రంకి వెంకటరమణ. కె. దయానంద, కోట్ల మోహనరావు, తిప్పాక కోటేశ్వరరావు, బొద్దాన గంగులు, భాస్కర్, ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు చైతన్యవంతులు కావాలి

**విజయనగరం :** అవినీతి రాజకీయాలను అంతం చేయాలంటే మహిళలు చైతన్యవంతులు కావాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన 80 మంది టీడీపీ మహిళా కార్యకర్తలు లోక్‌సత్తా పార్టీలో చేరారు. మద్యం అమ్మకాలను నియంత్రించడానికి మహిళలు చైతన్యవంతం కావాలని మహిళా సత్తా ప్రతినిధి అనంతలక్ష్మీ అన్నారు. గ్రామానికి చెందిన బాలిపెంటయ్య, బొబ్బాది అప్పారావు అధ్వర్యంలో మహిళలు లోక్‌సత్తా పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎం. సుభద్రాదేవి. ఎల్. శివరామారావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు కృషి చేస్తేనే ప్రతిభావంతులవుతారు

**విజయనగరం :** స్థానిక కణపాక చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 10వ తరగతిలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ విద్యార్థులు మరింత ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత విద్యాలక్ష్యాలు సాధించాలని సూచించారు.

## చిత్తూరు లో పర్యావరణ ర్యాలీ

పర్యావరణ పరిరక్షించుకోకపోతే మానవ మనుగడే ప్రశ్నార్ధకంగా మారుతుందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు వి. జయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం శ్రమిస్తున్న రామచంద్రయ్య, ఈ ర్యాలీలో లిటల్‌రోస్, ఆర్‌కె జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, విజయం విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. గాంధీ విగ్రహం నుండి పొన్నియమ్మగుడి వీధి, బజారువీధి, హైరోడ్డులో ప్లేకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షుడు కె. మాధవన్, పట్టణ అధ్యక్షులు జానకిరామరెడ్డి, పూతలపట్టు లోక్‌సత్తా కన్వీనర్ చెంగల్రాయరెడ్డి, రామ్మూర్తిరెడ్డి, సుందరరాజు, శంకర్, లోక్‌సత్తా పార్టీ మహిళా అధ్యక్షులు మంజువాణి విజయాగాంధీ, విశ్వహిందుపరిషత్ జిల్లా కార్యదర్శి యంజి రామభద్ర, రాజేంద్రప్రసాద్, భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. ■



వరంగల్ జిల్లాలోని పాకాల సరస్సు దృశ్యం



“ప్రపంచ వింతలలో ఒకటైన గ్రేట్‌వాల్ ఆఫ్ చైనా”

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



విజయనగరం జిల్లా ధర్మపురి గ్రామంలో లోక్‌సత్తాలో సామూహికంగా చేరిన మహిళలు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad